ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 4 డిసెంబరు 2024



రాజంపేట-రాయచోటి మధ్య తిరుగుతున్న ఆర్డినరీ బస్సు



కోడూరులో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు



రాయచోటి బస్సు కోసం రాజంపేట పాతబస్టాండులో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

'అన్నమయ్య' అష్టకష్టాలు

- రాజంపేట ప్రజలతో మూడు ముక్కలాట
- జిల్లా కేంద్రానికి బస్సులు కరువు
- 3 వాహనాలు మారితేనే జిల్లా కేంద్రానికి..
- జిల్లా కేంద్రం 10 కిలోమీటర్లు..
- అయినా రాజంపేట డివిజన్‌కు వీరబల్లె, సుండుపల్లె వాసులు
- రెండు జిల్లాల మధ్య నలిగిపోతున్న ఒంటిమిట్ట, సిద్దవటం



రాజంపేట, కోడూరు వాసులకు గుదిబండగా మారిన రాయచోటి ఘాట్‌రోడ్డు

కొత్త జిల్లాలు ఏర్పాటై రెండేళ్లు దాటినా నాడు జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల ఇక్కడి ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. అన్నమయ్య పేరు పెట్టి రాయచోటి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు గతంలో కంటే మెరుగ్గా ప్రజలకు మేలు చేయాల్సి ఉంది. అలా కాకుండా ప్రజల మనోభావాలకు విరుద్ధంగా జగన్ తీసుకున్న నిర్ణయంతో రాజంపేట, రైల్వేకోడూరు వాసులకు తీవ్రం అన్యాయం జరిగిందని ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటు అసంబద్ధంగా జరిగిందని అప్పట్లో అందరూ కోడై కూశారు. అన్నమయ్య పేరు పెట్టి రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతో ఇక్కడి ప్రజలు అప్పట్లో ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా రైల్వేకోడూరు మండలం పూర్తిగా పొరుగు జిల్లా కేంద్రమైన తిరుపతికి ఆనుకుని ఉంది. ఈ నియోజకవర్గాన్ని మొదటి నుంచి తిరుపతి జిల్లాలో కలపాలన్న డిమాండ్ ఉంది. కోడూరు సరిహద్దు నుంచి తిరుపతికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఈ మండలంతో పాటు చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు మండలాలకు తిరుపతి ఎంతో సౌకర్యం. వీరంతా తిరుపతిలో తమ నియోజకవర్గాన్ని కలిపితే అన్నివిధాలా బాగుంటుందని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన సమయంలో ఆందోళనలు చేసినా వాటిని పట్టించుకోకుండా అప్పటి జగన్ ప్రభుత్వం రైల్వేకోడూరును అన్నమయ్య జిల్లాలో కలిపారు. కోడూరు నుంచి రాయచోటికి వెళ్లాలంటే 100 కిలోమీటర్లు అందునా 30 కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డులో ప్రయాణం చేయాల్సి ఉంది. కనీసం కోడూరు నుంచి రాయచోటికి నేరుగా ఇంతవరకు ఒక్క బస్సు కూడా లేదు. పల్లెవాసులైతే పల్లె నుంచి కోడూరుకు, కోడూరు నుంచి రాజంపేటకు, రాజంపేట నుంచి రాయచోటికి 3 బస్సులు మారాల్సి ఉంది. నియోజకవర్గ ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే బస్సులు లేక డొక్కు బస్సుల్లో పోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

● సుండుపల్లె, వీరబల్లె మండలాలు కేవలం అరగంటలోనే జిల్లా కేంద్రం రాయచోటికి చేరుకోవచ్చు. ఈ రెండు మండలాల్లో కనీసం 80 వేల జనాభా ఉంటుంది. ఈ రెండు మండలాల ప్రజలకు ప్రతి నిత్యం రెవెన్యూ డివిజన్ కేంద్రంతో పని ఉంటుంది. ఈ రెండు మండలాలను రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కాకుండా 50 కిలోమీటర్ల దూరంలోని రాజంపేట డివిజన్ కేంద్రంలో చేర్చారు. ఇదేమని అడిగితే రెవెన్యూ డివిజన్‌లో తక్కువ మండలాలు ఉంటే ఉపయోగం ఉండదు. దానికి తగ్గట్టు పరిపాలనా సౌలభ్యం కోసం సుండుపల్లె, వీరబల్లి మండలాలను కలిపామని గత పాలకులు చెప్పారు. వారు దిగిపోయినా వారు చేసిన ఈ అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు రాజంపేట నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఈ రెండు మండలాలను కడప జిల్లాలో కలిపివేశారు. ఒక నియోజకవర్గంలో ఉండే మండలాలను విడదీసి వేరే జిల్లాలో కలపడం పరిపాలనాపరంగా అటు ప్రజాప్రతినిధులకు, ఇటు అధికారులకు ఎంత ఇబ్బంది ఉంటుందో చెప్పనలవి కాదు. దీంతో ఈ రెండు మండలాల ప్రజలు అటు వేరే జిల్లా, ఇటు వేరే జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒంటిమిట్ట, సిద్దవటం వాసులకు కడప అతి దగ్గర ప్రాంతమైనా.. నియోజకవర్గ కేంద్రం వేరే జిల్లాలో ఉండడం వల్ల రెండు జిల్లాల్లో వీరు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ మండలాల్లో సమస్య ఉత్పన్నమైతే కడప జిల్లా అధికారులతో మాట్లాడాలి. మరో సమస్య ఎదురైతే రాజంపేట నియోజకవర్గ అధికారులతోను, ప్రజాప్రతినిధులతో మాట్లాడాలి. ఇది ఎంత కష్టమో చెప్పనలివి కాదు.

ఒక జిల్లా కేంద్రం ఏర్పాటైనప్పుడు కనీసం రోడ్లు అయినా సక్రమంగా ఉండాలి. ప్రస్తుతం రాయచోటి-రాజంపేట ఘాట్ రోడ్డు చాలా ప్రమాదకరమైంది. రెండు ఘాట్‌రోడ్లను దాటి బస్సుల్లోను, ఆటోల్లోను, ఇతర వాహనాల్లో వెళ్లడం కష్టసాధ్యమే. కార్లల్లో వెళ్లేవారికి అది అంత కష్టం అనిపించకపోయినా ఆర్టీసీ వారి డొక్కు బస్సుల్లో వెళితే కష్టం తెలుస్తుంది. ఘాట్‌రోడ్డు పూర్తిగా దెబ్బతింది. సానిపాయి వద్ద ఘాట్ రోడ్డు దిగువ ప్రాంతం కొండరాళ్లతో వెక్కిరిస్తోంది. కనీసం ఈ కొండరాళ్లను పూడ్చి రోడ్డు వెడల్పు చేయాలన్న ఆలోచన జిల్లా అధికారులకు లేకపోవడం బాధాకరం. ఇక్కడ అనేక ద్విచక్ర వాహనదారులు పడి గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం జిల్లాల వ్యవహారంపై పునరాలోచన చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



ఘాట్‌లో దెబ్బతిన్న రోడ్డు

ఒక్క బస్సు కూడా లేదు..



రాయచోటికి నేరుగా కోడూరు నుంచి ఇంతవరకు ఒక్క బస్సు కూడా ఏర్పాటు చేయలేదు. ఇక్కడి పల్లెల ప్రజలు కోడూరుకు వచ్చి అక్కడి నుంచి రాజంపేటకు వెళ్లి రాజంపేట నుంచి రాయచోటికి మూడు బస్సుల్లో వెళ్లి రావడం చాలా కష్టసాధ్యం. కనీసం నియోజకవర్గ కేంద్రం నుంచి రాయచోటికి ఒక బస్సు సర్వీసు ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఉండడం బాధాకరం.

- సీహెచ్ చంద్రశేఖర్, సీపీఎం నాయకుడు, రైల్వేకోడూరు

జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్నా..



అరగంట లోపు సుండుపల్లె, వీరబల్లె మండలవాసులు రాయచోటికి వెళ్లి పనులు చేసుకుని సులభంగా ఇంటికి చేరతారు. అటువంటిది రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో ఈ రెండు మండలాలను కలిపారు. రాయచోటి కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినప్పుడు అక్కడ ఎందుకు చేర్చలేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా మమ్మల్ని రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలపాలి.

- రామా శ్రీనివాసులు, సంఘసేవకుడు, సుండుపల్లె

రెండు జిల్లాల నడుమ అష్టకష్టాలు..



సిద్దవటం, ఒంటిమిట్ట ప్రజలది చెప్పుకోలేని సమస్య. మేముండేది రాజంపేట నియోజకవర్గంలో, మా రెండు మండలాలు కలిపింది కడప జిల్లాలో. కడప జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రం మాకు ఇబ్బంది లేదు. కానీ ఏదైనా సమస్య వస్తే ఇటు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటకు, అటు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. రెండు జిల్లాల అధికారులతో మాట్లాడాల్సి వస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే అటు అన్నమయ్య ఇటు కడప రెండు జిల్లాల మధ్య మేము తైతక్కలాడాల్సి వస్తోంది.

- ఎస్వీ రమణ, ఒంటిమిట్ట

ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్ల సస్పెన్షన్

● బదిలీ చేసినా విధుల్లో చేరకపోవడంతోనే..

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్‌ను మదనపల్లి నుంచి గత నెల ఒకటో తేదీ రాయచోటి కలెక్టరేట్ ల్యాండ్ ఆక్విజేషన్ సెక్షన్‌కు బదిలీ చేశారు. అయితే ఆయన ఇప్పటి వరకు విధుల్లో చేరకపోవడంపై తదుపరి చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే వీరబల్లి డిప్యూటీ తహసీల్దార్ వినీత్‌కుమార్‌రెడ్డిని గత నెల 21వ తేదీ రాయచోటి కలెక్టరేట్ కో-ఆర్డినేటర్ సెక్షన్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన ఇప్పటి వరకు డ్యూటీలో చేరి రిపోర్టు చేయకుండా చెప్పకుండా వెళ్లిపోయాడని దీంతో ఆయనను కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పొట్టకూటికి వెళ్లి కువైత్‌లో మృతి



అజాద్‌బేగ్ (ఫైల్)

పెద్దమండ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతూరుకు చెందిన రహంతుల్లా కుమారుడు అజాద్ బేగ్ (44) కువైత్‌లో గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు మంగళవారం తెలిపారు. వారి వివరాల మేరకు... అజాద్‌బేగ్ కువైత్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 12 సంవత్సరాలుగా కువైత్‌కు వెళుతూ వస్తున్నాడు. సోమవారం రాత్రి అజాద్ బేగ్‌కు ఆకస్మికంగా గుండెనొప్పితో అస్వస్థతకు గురై మృతి చెందినట్లు వారు తెలిపారు. 20 ఏళ్ల క్రితం అజాద్‌బేగ్ అత్తగారి ఊరైన ములకలచెరువు మండలం చౌడసముద్రంలో స్థిరపడ్డాడు. అతడికి ఇద్దరు పిల్లలు వున్నారు. పొట్టకూటి కోసం వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన అజాద్ బేగ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదతర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా విధులు నిర్వర్తించాలని, బహిరంగ మద్యపానంపై ముమ్మరంగా తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు సందర్శిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసుల్లో పురోగతి సాధించాలని తెలిపారు. ముఖ్యంగా చోరీ కేసుల్లో సొత్తు త్వరితగతిన రికవరీ చేసి బాధితులకు అప్పజెప్పాలన్నారు. గంజాయి కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసుల మీద అధికారులను సబ్ డివిజనల్‌ల వారీగా అడిగి తెలుసుకున్నారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. అదేవిధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు ఎక్కువగా నమోదు చేయాలని, రోడ్డు భద్రతపై వాహనదారులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజెప్పాలని, దాడులు ఉధృతం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రాయచోటి, మదనపల్లె, రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారులు ఎంఆర్ కృష్ణమోహన్, డి.కొండయ్యనాయుడు, ఎన్.సుధాకర్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పీలేరు వద్ద పరవళ్లు తొక్కుతున్న పింఛా నది



నిండు కుండను తలపిస్తున్న కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



పరవళ్లు తొక్కుతున్న పింఛా

పీలేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో చిత్తూరు జిల్లాలోని సదుం, సోమల మండలాల్లో కురిసిన వర్షాల కారణంగా పీలేరులో పింఛా నది పరవళ్లు తొక్కుతోంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు సదుం, సోమల మండలాల్లోని ప్రాజెక్టులు, చెరువులు నిండి మొరవపోతుండడం, సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పింఛా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో మంగళవారం పింఛా నదిలో నీటి ఉధృతి పెరిగింది. పింఛా నదిలో ప్రవాహం పెరగడంతో అప్రమత్తమైన టీడీపీ నేతలు, రైతులు పింఛా నది నుంచి పీలేరులోని అయ్యప్పనాయుని చెరువుకు నీటిని మళ్లించారు. గత నెలలోనూ పింఛా నదిలో నీరు రావడంతో పీలేరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పింఛా నది నుంచి కాలువల ద్వారా నీటిని మళ్లించారు. వారి కృషి ఫలించి ప్రస్తుతం కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిండుకుండను తలపిస్తోంది. నీటి ఉధృతి పెరుగుతుండటంతో పీలేరు రెవెన్యూ, పోలీసులు అధికారులు నది పక్కనున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గతంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలంవారిపల్లె పంచాయతీ నూనేవాండ్లపల్లె వద్ద ఉన్న బ్రిడ్జిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఐదేళ్ల క్రితం పింఛా నది ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ఆ బ్రిడ్జీని దాటేందుకు ప్రయత్నించిన ఓ జంట నీటిలో కొట్టుకుపోయి మృత్యువాతపడింది. అటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా తహసీల్దారు భీమేశ్వరరావు, ఎస్ఐ బాలకృష్ణ మంగళవారం ఉదయం బ్రిడ్జికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రిళ్లు సైతం అక్కడ ఇద్దరు సిబ్బందిని కాపలా పెడతామని ఎస్ఐ తెలిపారు.



గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన దృశ్యం

'పింఛా' నుంచి నీరు విడుదల

● మూడు గేట్ల ద్వారా

3,779 క్యూసెక్కుల నీరు

సుండుపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి పింఛా ప్రాజెక్టు గేట్ల ద్వారా 3,779 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు పింఛా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ మంగళవారం తెలిపారు. సాయంత్రం 4 గంటల సమయంలో నదిలోకి నీటిని విడుదల చేశామన్నారు. పై ప్రాంతాలు, అటవీ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి నీరు చేరుతుండడంతో పైఅధికారుల ఆదేశాల మేరకు నీటిని వదిలామన్నారు. సుమారు నాలుగు సంవత్సరాల తర్వాత ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నింపడం జరిగిందన్నారు. ప్రాజెక్టు మట్టి కట్ట 2021వ సంవత్సరంలో నివర్ తుఫాను కారణంగా కొట్టుకుపోయిందని, మూడు నెలల క్రితం ప్రాజెక్టు పనులు 95 శాతం పూర్తయ్యాయని తెలియజేశారు. పూర్తి సామర్థ్యంతో నీటిని నిలువ చేస్తున్నట్లు తెలిపారు.

డిగ్రీ ప్రశ్నపత్రం లీక్

● పరీక్ష వాయిదా వేసిన వీసీ

కడప ఎడ్యుకేషన్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రం లీక్ అయింది. దీంతో అధికారులు పరీక్షను వాయిదా వేశారు. వైవీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు గత నెల 29 నుంచి జరుగుతున్నాయి. ఈ పరీక్షలకు ఉమ్మడి కడప జిల్లాలో 54 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపుగా 20 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మంగళవారం డిగ్రీ మూడో సెమిస్టర్ సంస్కృతం పరీక్ష జరిగింది. ఈ పరీక్ష కేవలం 100 మంది మాత్రమే రాయాల్సి ఉంది. పరీక్ష ప్రారంభానికి ముందు రాయచోటి పట్టణం కొత్తపేట సమీపంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల నుంచి ప్రశ్నపత్రం లీక్ అయినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ విషయాన్ని తెలుసుకున్న వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి హుటాహుటిన రాయచోటి పరీక్షా కేంద్రానికి చేరుకుని లీకేజీపై ఆరా తీశారు. వైస్ చాన్సలర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై వీసీ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాయచోటి కేంద్రంలో ప్రశ్నపత్రం బయటకు వచ్చిందని తెలియగానే పరీక్షను రద్దు చేశామన్నారు. దీనిపై కమిటీతో విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఒక్క విద్యార్థి, వైఎస్సార్ జిల్లా పరిధిలో 99 మంది విద్యార్థులు రాసే ఈ పరీక్ష త్వరలో నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా.. అన్నమయ్య జిల్లా పరిధిలో ఒక్క విద్యార్థి పరీక్ష రాసే కేంద్రం నుంచి ఈ ప్రశ్నపత్రం లీక్ కావడం విశేషం.

తనిఖీలో బయటపడ్డ అక్రమాలు

● రూ.72,071 రికవరీకి డ్వామా పీడీ ఆదేశం



ఉపాధి సిబ్బందిని విచారిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలంలో జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పలు అవకతవకలు బయటపడ్డాయి. రూ.72,071 రికవరీకి డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థానిక సీఎల్‌ఆర్సీ కార్యాలయంలో డ్వామా పీడీ అధ్యక్షతన ప్రజావేదిక సభ జరిగింది. ఇందులో సామాజిక తనిఖీలో బయటపడ్డ అవకతవకలను వెల్లడించారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 1వ తేదీ వరకు జరిగిన 1813 ఉపాధి పనులకు సంబంధించి రూ.12.32 కోట్లు చెల్లింపులు జరిగాయి. ఈ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందాలు పది రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అలాగే కూలీలతో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. కొలతల్లో తేడాలు, అదనపు చెల్లింపులు, బిల్లుల చెల్లింపుల్లో అలసత్వం తదితర విషయాలు బయటపడ్డాయి. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం రూ.72,071 రీకవరీ చేయాలని డ్వామా పీడీ ఆదేశించారు. ఈ సభలో ఎంపీడీవో హరినారాయణ, ఎస్ఆర్‌పీ సుబ్బారావు, ఏపీవో నారాయణస్వామి, ఉపాధి ఇంజనీరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. తిరుపతి రోడ్డా..!

● ఈ రోడ్డులో ప్రయాణమంటేనే హడలిపోతున్న ప్రయాణికులు
● వర్షాలతో రోడ్డంతా గుంతలే



అక్కడ ఇళ్ల నిర్మాణాలెలా...?

- చౌడు భూమి.. ఊట స్థలంలో లేఅవుట్లు
- జగనన్న కాలనీలు.. అధ్వానం
- వైసీపీ వైఖరితో ఆగిన పక్కా గృహనిర్మాణాలు
- పక్కాగృహాలు కట్టేందుకు జంకుతున్న జనం

పెద్దమండ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో జనం కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇంటి పట్టాలు సంబరంగా పంపిణీ చేశారే కానీ.. కాలనీలు ఎంచుకున్న ప్రదేశాలు సరైనవి కావని లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 11 జగనన్న కాలనీలు ఉన్నాయి. అందులో పెద్దమండ్యం, వెలిగల్లు, తురకపల్లె జగనన్న కాలనీలు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఇచ్చిన వాటిలో సగానికి పైగా పునాది దశలోనే ఉన్నాయి. పెద్దమండ్యం, వెలిగల్లు లేఅవుట్లలో 208 పక్కాగృహాలు మంజూరు చేయగా కేవలం 19 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి పునాది దశలో, మోల్డింగ్ దశలోనే ఉన్నాయి. ఇక తురకపల్లె జగనన్న కాలనీలో ఇప్పటి వరకు ఒక రాయి కూడా పడలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. వైసీపీ ప్రభుత్వం వైఖరి వల్ల రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేకపోవడం కూడా కారణంగా చెప్పవచ్చు.

పెద్దమండ్యం పట్టణం సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఠానా ప్రాంతంలో చౌడు ఊట స్థలంలో ఏర్పాటు చేశారు. వర్షకాలంలో ఈ కాలనీలో మనుషులు తిరగడమే కష్టం. మరి ఇటువంటి చోట గృహ నిర్మాణాలు ఎలా చేయాలంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ వెళితే తిరిగి రావడం కష్టమే. ఇక వెలిగల్లు గ్రామానికి ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో ఉన్న జగనన్న కాలనీ విషయానికొస్తే.. గ్రామస్తులు నిరాకరించినా కాలనీ ఏర్పాటు చేశారు. పాపేపల్లి గ్రామ పంచాయతీ పి.తురకపల్లి నదీ ప్రవాహ ప్రాంతంలోని ఊట నీరు ప్రాంతంలో లేఅవుట్ ఏర్పాటు చేశారు. కానీ అక్కడ ఒక్క లబ్ధిదారుడు కూడా పక్కా గృహం నిర్మించుకోవడానికి సుముఖత చూపలేదు.

అమ్మో... ఆ కాలనీల్లోనా..!

పెద్దమండ్యం పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఠానా ప్రాంతం అంటేనే చౌడు భూములు. వర్షాకాలంలో మనుషులు కూడా తిరగలేని భూములని అందరికీ తెలుసు. కానీ హడావిడిగా రెండు దశల్లో పెద్దమండ్యం పట్టణ జగనన్న కాలనీలో 175 ప్లాట్లతో జగనన్న కాలనీ లేఅవుట్ వేశారు. నీరు, కరెంట్, కాలనీలో వెళ్లలేని పరిస్థితి ఉన్నా విధిలేని పరిస్థితుల్లో చౌడు భూమి స్థలాల్లోనే ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు పునాది వేశారు. ఆ కాలనీ పేర్లు చెబితేనే అమ్మో.. అంటున్నారు. పునాదులు తవ్వే సమయంలో పునాది గుంతల్లో నీరొచ్చినా సాహసించి నిర్మాణాలు చేపట్టారు.

నీటి కోసం బోరు వేసినా, విద్యుత్తు కోసం స్తంభాలు నాటినా కనెక్షన్ ఇవ్వలేదు. అతి కష్టం మీద చౌడు భూముల్లో నిర్మాణ సామగ్రి తరలించారు. అంతేకాకుండా ఈ ప్రాంతం చెరువుకట్ట కింద ఉండడంతో పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఊట స్థలంలో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపడతారని పలువురు లబ్ధిదారులు ప్రశ్నించారు. ఊట నీరు లేఅవుట్‌లోకి రాకుండా అడ్డంగా కాలువ నిర్మాణం చేశారు. వెలిగల్లు గ్రామానికి ఒకటిన్నర కి.మీ. దూరంలో 111 ప్లాట్‌లతో జగనన్న కాలనీలో రెండు లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అక్కడ మూడు పక్కాగృహాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇక్కడ ప్లాట్ల కేటాయింపులో అనర్హులకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పాపేపల్లి గ్రామ పంచాయతీ పి.తురకపల్లి సమీపంలో చౌడు భూమిలో ఊటనీరు నదీ ప్రవాహ ప్రాంతంలో 41 ప్లాట్లతో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇక్కడ పక్కాగృహాల నిర్మాణాలకు లబ్ధిదారులు చొరవ చూపలేదు.

ఆందోళన కలిగిస్తున్న నిబంధనలు

ఈ ఏడాది డిసెంబరులోపు పక్కాగృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారు. ఈ నిబంధనలతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. మన ఇళ్లు-మన గౌరవం అనే కార్యక్రమాలు జరిగాయి. గత వారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో డిసెంబరు నెలలోపు పక్కాగృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈ వెంకటరెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు తెలపడంతో గుబులు రేగుతోంది. నిర్మాణ సామగ్రి ధరలు రెట్టింపు కావడంతో నిర్మాణాలు తమ వల్ల కాదని కొందరు తేల్చి చెప్పారని తెలుస్తోంది.



పెద్దమండ్యంలో నిర్మాణాలకు నోచుకోని జగనన్న కాలనీ



వెలిగల్లు జగనన్న కాలనీలో నిర్మాణాల పరిస్థితి

పెద్దమండ్యం, వెలిగల్లు లేఅవుట్లలో..

మంజూరైన పక్కాగృహాలు	208
పునాది దశలో ...	60
బేస్‌మెంట్ వరకు...	52
మోల్డింగ్ దశలో...	24
మోల్డింగ్ పూర్తయినవి	02
నిర్మాణం పూర్తయినవి	19

త్వరలోనే సదుపాయాలు కల్పిస్తాం

- అక్రమ్, ఏఈ, హౌసింగ్

జగనన్న కాలనీల్లో రోడ్లు, నీరు, విద్యుత్తు సౌకర్యం కల్పనకు ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సదుపాయాలు కల్పిస్తాం. ఇవి లేకనే ఇళ్లు కట్టుకోలేక పోతున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు. వీటిపై ఉన్నతాధికారులతో మాట్లాడి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాము.

ఈ-ప్రగతి నుంచి పరివాహన్

వాహన సేవల వెబ్‌సైట్ పేరు మార్పు : జిల్లా రవాణా అధికారి



సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారుల సేవలను గత ప్రభుత్వంలో ఉన్న ఈ-ప్రగతి వెబ్‌సైట్‌ను పరివాహన్ పేరుతో మార్చినట్లు అన్నమయ్య జిల్లా రవాణా అధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో వాహనదారులు వారికి అవసరమైన సేవలు పొందేందుకు లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు తదితర వాటి కోసం ఈ-ప్రగతి వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసేవారన్నారు. అయితే ఇకపై పరివాహన్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని వాహన సేవలు పొందాలని ఆయన సూచించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. అలాగే పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 64 చోట్ల బ్లాక్ స్పాట్స్ గుర్తించి అక్కడ ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు చేపడుతున్నామన్నారు. అంతేగాక వాహనదారులు కూడా ట్రాఫిక్ నియమ నిబంధనలను, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ అన్నమయ్య జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తయారు చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇకపై వాహన సేవలను ఈ-ప్రగతి వెబ్‌సైట్‌లో కాకుండా పరివాహన్ అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసి వారికి అవసరమైన వాహన సేవలను పొందాలని ఆయన సూచించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ శాఖలన్నీ పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, వాటిని అర్థం చేసుకుని జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గత కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సీపీవో వెంకటపెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 6వ తేదీ నుంచి జరగబోయే రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మండల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఏ తేదీల్లో ఏ గ్రామంలో సదస్సును నిర్వహించబోతున్నారో ముందుగా ప్రకటన ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, సమన్వయంతో సదస్సులను నిర్వహించాలని ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ భూముల రీవెరిఫికేషన్ నివేదికలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే విధానం, నీటి పన్నుల మాడ్యుల్‌పై 4వ తేదీ వీఆర్‌వోలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఆర్‌వోను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో సీటులోనే ఇరుక్కుపోయిన అష్రఫ్

వాల్మీకిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం వేకువజామున వాల్మీకిపురం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..కలికిరి పట్టణంలోని శివాలయంవీధికి చెందిన అబ్దుల్లా కుమారుడు అష్రఫ్ (27)మంగళవారం వేకువజామున బెంగళూరు నుంచి కలికిరికి కారులో వెళ్తుండగా వాల్మీకిపురం మండలంలోని టీఎం వ్యాలీ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అష్రఫ్ అక్కడికక్కడే మృతి చెంది సీట్‌లోనే ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో అష్రఫ్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా టీఎం వ్యాలీ సమీపంలో జాతీయ రహదారిలో వర్షాలు కురిసే సమయంలో రోడ్డు జారుడు స్వభావంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు దృష్టి సారించి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నమయ్య జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ మంగళవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పరిధిలోని మదనపల్లె-1టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న అన్వర్‌బాషను అన్నమయ్య డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న కేబీ శివకుమార్‌ను మదనపల్లె-1టౌన్ పీఎస్‌కు, మదనపల్లె-2 టౌన్ పీఎస్‌లో ఉన్న రవికుమార్‌ను పీటీయం పీఎస్‌కు, పీటీయం పీఎస్‌లో ఉన్న ఎంకే నరసింహులును ములకలచెరువు పీఎస్‌కు, ములకలచెరువు పీఎస్‌లో ఉన్న గాయత్రిని మదనపల్లె-2టౌన్‌కు, అన్నమయ్య డీపీటీసీలో ఉన్న రమేశ్‌బాబును అన్నమయ్య డీఎస్‌బీ-2లోకి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు.

వామ్మో... తిరుపతి రోడ్డా...!

- ఈ రోడ్డులో ప్రయాణమంటేనే హడలిపోతున్న ప్రయాణికులు
- వర్షాలతో రోడ్డంతా గుంతలే



గుంతలమయమైన రైల్వేకోడూరు-తిరుపతి రోడ్డు

రైల్వేకోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోడూరు-తిరుపతి మార్గమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. అడుగుతో గుంత చొప్పున ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అవి మరింత పెద్దవై ఆ గుంతల్లో చిన్న వాహనాల టైర్లు పడితే పైకి లేచే పరిస్థితి లేకుండా తయారయ్యాయి. తిరుపతి మార్గం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. అలాగే కడప, రాజంపేట మార్గం కూడా రద్దీగానే ఉంటుంది. ఎక్కువగా హైదరాబాద్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్నూలు తదితర నగరాల నుంచి తిరుమలకు వస్తుంటారు. గుంతలు పడిన రోడ్డులో వాహనాలు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు అంటున్నారు. రైల్వేకోడూరు మండలంలోని శాంతినగర్ నుంచి తిరుపతి వరకు ప్రధానదారి పూర్తిగా గుంతలమయంగా మారిపోయింది. అదే విధంగా రైల్వేకోడూరు నుంచి కడప వరకు గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుంతలు పూడ్చే కార్యక్రమం క్రింద కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసింది. అయినా రైల్వేకోడూరు-తిరుపతి, రైల్వేకోడూరు-కడప మార్గం లో చిన్న, చిన్న గుంతలను పూడ్చి ఉండి ఉంటే పెద్ద గుంతలు పడేవి కావని ప్రయాణీలు అంటున్నారు. రైల్వేకోడూరు నుంచి ఎక్కువగా తిరుపతి కి ఉద్యాన పంటలు ఎగుమతి అవుతుంటాయి. వీటిని తీసుకుని పోవాలంటే నరకయాతన పడుతున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే గర్భిణులు ప్రసవించే విధంగా రోడ్లు మారాయి. ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద, పెద్ద గుంతల వద్ద హెచ్చరిక బోర్డులను తాత్కాలికంగా పోలీసులు ఏర్పాటు చేశారు. వాహనాలు సకాలంలో తిరుపతి, రాజంపేట, కడప తదితర ప్రాంతాలకు చేరుకోలేక ఉన్నాయి. అంబులెన్సులు కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, రైల్వేకోడూరు నుంచి తిరుపతి వెళుతుంటాయి. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయో అని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని రోడ్లు బాగు చేయాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

కడపకు మూడు గంటలు పడుతోంది



గుంతలతో కడప కు ప్రయాణించాలంటే సుమారు 3 గంటలకు పైగా సమయం పడుతుంది. గుంతలు లేని సమయంలో రైల్వేకోడూరు నుంచి కడప కు రెండు గంటల సమయం పడుతుండేది. ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది.

-చెన్నంశెట్టి వెంకటరమణ, వ్యాపారి, రైల్వేకోడూరు

ఎక్కడ చూసినా గుంతలే...



చిన్న, చిన్న గుంతలు ఏర్పడినప్పుడే సరి చేసి ఉంటే ఇటు వంటి పరిస్థితి రాకుండా ఉండేది. ఎక్కడ చూసినా గుంతలు కనిపిస్తున్నాయి. ఒక్క గంటలో తిరుపతి వెళ్లే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. వెంటనే గుంతలు పూడ్చి రోడ్లు వేయాలి.

- విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు, ముక్కావారిపల్లె

నరకయాతనే...



రైల్వేకోడూరు నుంచి తిరుపతికి వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నాము. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని భయపడుతున్నాము. గుంతలను చూస్తుంటే భయమేస్తోంది. కార్లు ఎక్కడ దెబ్బతింటాయని ఆందోళన ఉంది. వెంటనే గుంతలను పూడ్చి కొత్తగా రోడ్లు వేయాలి.

- సిద్దిలింగం మురళీక్రిష్ణ, రైల్వేకోడూరు

ఎంఎస్‌ఎంఈ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎంఎస్‌ఎంఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఐపీవో (ఇండియన్ ప్రోజైన్ ఆఫీసర్) శంకర్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సీసీలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల వివరాలను సచివాలయ సిబ్బంది చేపడుతున్నారని, ఇందులో ఎటువంటి మోసాలు లేవని ఇది పూర్తిగా ప్రభుత్వం చేపడుతున్న సర్వే అని ఈ సర్వేకు అందరూ సహకరించాలన్నారు. ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరిస్తారని, ఆయా సభ్యుల ఫొటోలను యాప్ ద్వారా తీసి ఈ యాప్‌లో నమోదు చేస్తారని, గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకారం ప్రతి ఒక్కరికీ ఆధార్ లింక్‌తో బ్యాంకు అకౌంట్ ఉంటే ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. ఈ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకుంటే తద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాలను పొందవచ్చన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు ప్రజలకు వివరించి ఈ యాప్‌ల్లో సర్వే చేసుకునేందుకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఈవోపీఆర్డీ యోగానంద్, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, కొండా శివప్రసాద్, వెలుగు సీసీలు బావాజాన్, రామాంజులుతో పాటు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐదు నెలల ఉపాధి పనుల పరిశీలన

- ఎంపీ ఫిర్యాదుతో బృందాలు ఏర్పాటు చేస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు
- 2019 నుంచి జరిగిన పనులపై కూడా విచారణ జరపాలని టీడీపీ డిమాండు

కలికిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏప్రిల్ నెల నుంచి జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు చేసుకుంటున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లాలోని కలికిరి, చిత్తూరు జిల్లాలోని రొంపిచెర్ల, సోమల మండలాల్లో కూలీలు లేకుండానే యంత్రాలతో పనులు చేసినట్లు ఎంపీ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని పైన పనులను పరిశీలించి నివేదిక పంపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ఆయా డ్వామా పీడీలను ఆదేశించారు. డైరెక్టరు ఆదేశాల మేరకు కలికిరి మండలంలో జరిగిన పనులను పరిశీలించేందుకు నాలుగు టీములను ఏర్పాటు చేస్తూ డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని అద్దవారిపల్లె, చీకటిపల్లె, గుండ్లూరు, గుట్టపాళెం పంచాయతీల్లో పనులను పరిశీలించడానికి రాజంపేట ఏపీడీ ఎం.ప్రతాప్ ఆధ్వర్యంలో ఒక బృందం, కలికిరి, మర్రికుంటపల్లె, మేడికుర్తి, మునేళ్ళపల్లె పంచాయతీల్లో పరిశీలించడానికి రాయచోటి ఏపీడీ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పారపట్ల, పత్తేగడ, సండ్రావారిపల్లె పంచాయతీలకు కలికిరి ఏపీడీ ఎస్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో... అలాగే మొరంకిందపల్లె, మహల్, పల్లవోలు పంచాయతీల్లో పనుల పరిశీలనకు తంబళ్లపల్లె ఏపీడీ ఎస్.మధుబాబు ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటు చేశారు.

నేటి నుంచి పనుల పరిశీలన

నాలుగు టీములకు సంబంధించిన కొంత మంది మంగళవారం కలికిరిలో గత ఐదు నెలలుగా జరిగిన పనుల జాబితాలను సేకరించారు. బుధవారం నుంచి క్షేత్ర స్థాయిలో పనులు జరిగిన తీరుతెన్నులను పరిశీలించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ నుంచి 14 పంచాయతీల్లో రూ. 5.94 కోట్లను కూలీలకు పంపిణీ చేశారు. 2,09,450 పనిదినాలు నమోదయ్యాయి. గృహ నిర్మాణాలు, పండ్లతోటల వంటి పనులకు రూ.1.52 కోట్లు మెటీరియల్స్ కోసం ఖర్చు పెట్టారు. ఏప్రిల్, మే నెలల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు జరిగాయి. మొత్తం ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకూ చెల్లింపులు జరిగిన పనులన్నింటినీ పరిశీలిస్తారా లేక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జూన్ నెల నుంచి జరిగిన పనులను మాత్రమే పరిశీలిస్తారా అనే విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

2019 నుంచి జరిగిన పనులపై విచారణ చేయాలి

కాగా వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఐదేళ్లపాటు జరిగిన పనులన్నింటి పైనా విచారణ చేయాలని టీడీపీ డిమాండు చేసింది. ఈ మేరకు మంగళవారం విచారణకు వచ్చిన అధికారులకు మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం జరిగే విచారణపై తమకు అభ్యంతరం లేదని అయితే గత ఐదేళ్లలో జరిగిన పనులన్నింటిపై కూడా విచారణ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



2019 నుంచి జరిగిన పనులపై విచారణ జరపాలని వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పారిశ్రామికవేత్తలుగా... పేద మహిళలు

- లబ్ధి పొందనున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు
- 52 సంఘాలకు రూ.8.52 కోట్ల రుణాలు
- 308 మందికి జీవనోపాధులు



బేకరీ పరిశ్రమను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ (ఫైల్)

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలుగా మొదలైన మహిళా సంఘాలు నేడు పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదుగుతున్నాయి. సంఘాల్లో సభ్యులుగా చేరిన మహిళలు తాము దాచుకున్న సొమ్ముతో చిన్నపాటి వ్యాపారంతో ఉపాధి ఏర్పాటు చేసుకుని జీవనం సాగించడం మరికొంతమందికి స్ఫూర్తి కలిగిస్తుంది. తీసుకున్న రుణం తిరిగి సకాలంలో చెల్లిస్తుండడంతో బ్యాంకు అధికారులు మహిళా సంఘాలకు రుణం ఇచ్చి ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్నారు. సంఘాల్లోని సభ్యుల తపన చూసిన ప్రభుత్వం వారికి మరింత మెరుగైన జీవనోపాధులు కల్పించేందుకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దీంతో ఇప్పటి వరకు వ్యాపారం చేస్తున్న మహిళలు పరిశ్రమలు స్థాపించి.. మరికొంత మందికి ఉపాధి కల్పించే దిశగా తయారు చేస్తున్నారు. దీంతో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వ్యాపార లావాదేవీలపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉన్నతాధికారులు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థఅధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

మహిళల్లో ఆర్థిక స్థోమత పెంచేందుకు చర్యలు

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు.. వారి స్థోమత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వారి అభిరుచులకు అనుగుణంగా వివి.ద రంగాల్లో వ్యాపారం విస్తరించుకోవడంతో పాటు మరికొంతమందికి ఉపాధి కల్పించేదిశగా ఔత్సాహికులను ప్రోత్సహించడం జరుగుతుంది. ఇప్పటికే యూనిట్లు స్థాపన కోసం రుణం మంజూరుకు బ్యాంకు అధికారులతో సంప్రదించడం జరిగింది.

-సుబ్బారెడ్డి, డీపీఎం, జీవనోపాధుల విభాగం

52 సంఘాలు గుర్తింపు

జిల్లాలో 1,121 గ్రామ సమాఖ్యల పరిధిలో 27,622 స్వయం సహాయక సంఘాలున్నాయి. అందులో 2,82,526 మంది సభ్యులున్నారు. వీరి నుంచి జిల్లాలో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 52 స్వయం సహాయక సంఘాలను అధికారులు గుర్తించారు. వీటి ఏర్పాటు కోసం అవసరమైన ఆర్థికసాయం అందించేందుకు బ్యాంకు అధికారులతో చర్చలు జరిపి రుణం మంజూరు చేయిస్తున్నారు. ఇందులో కోటి రూపాయల పైన పెట్టుబడి పెట్టే పరిశ్రమలు ఉన్నాయి. మొత్తం 52 సంఘాలకు రూ.8.52 కోట్లు వివిధ బ్యాంకుల ద్వారా రుణం అందించనున్నారు. ఇవి ఏర్పాటు అయితే 308 మందికి ఉపాధి లభిస్తుంది.

- మైదుకూరు మండలంలోని వి.శ్రుతిరెడ్డి అనే మహిళకు డెయిరీ ఏర్పాటు కోసం రూ.కోటి 60 లక్షలు రుణం మంజూరు చేశారు.
- ఖాజీపేట మండలంలోని కోటేశ్వరమ్మ అనే మహిళకు రైస్‌మిల్లు ఏర్పాటు కోసం రూ.కోటి రుణం ఇవ్వనున్నారు.
- కలసపాడు మండలంలోని నారపురెడ్డి వెంకటసుధ బేకరీ పరిశ్రమ ఏర్పాటు కోసం రూ.40లక్షలు రుణం మంజూరు కానుంది.
- కలసపాడు మండలంలోని ఒక మహిళా సభ్యురాలు తన కుటుంబసభ్యులు మరమరాలు తయారీ పరిశ్రమ స్థాపన కోసం రూ.35లక్షలు మంజూరు చేయనున్నారు.
- ఒంటిమిట్ట మండలంలోని యనమల సుధామణి అనే మహిళ వాటర్‌ప్లాంటు ఏర్పాటు కోసం రూ.20లక్షలు రుణం మంజూరుకు ప్రతిపాదించారు.
- పోరుమామిళ్ల మండలంలోని ఓ సభ్యురాలు కుటుంబలోని వ్యక్తి అబ్దుల్ సత్తార్ పండ్లరసం తయారీ పరిశ్రమకు రూ.25లక్షలు కేటాయించనున్నారు.

రౌడీషీటర్ పప్పీ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురయిన రౌడీషీటర్ పప్పీ అలియాస్ కొప్పుల రాఘవేంద్ర (36) హత్యకేసును వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి నేతృత్వంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులోని నిందితులు యనమల లోకేష్‌రెడ్డి, సునీల్ రెడ్డిలను పట్టుకోవడానికి వారి స్నేహితుల ఇళ్లకు వెళ్లి పోలీసులు విచారించారు. లోకేష్‌రెడ్డి ఫోన్‌కాల్స్ ఆధారంగా ఆరా తీశారు. కాగా, మంగళవారం మధ్యాహ్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పప్పీ మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. పప్పీ మృతదేహాన్ని చూడటానికి పెద్ద ఎత్తున యువకులు జిల్లా ఆసుపత్రిలోని పోస్టుమార్టం గది వద్దకు చేరుకున్నారు. సాయంత్రం కుటుంబసభ్యులు, స్నేహితులు పప్పీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్పీ చొరవతో సౌదీ నుంచి మహిళకు విముక్తి

- గాలివీడుకు చేరుకున్న బాధితురాలు రమణమ్మ



భర్త ఆంజనేయులుతో రమణమ్మ

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం సౌదీ అరేబియా దేశం వెళ్లి.. అక్కడ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నీరుగట్టు రమణమ్మ అనే మహిళను అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేక చొరవ చూపి స్వదేశానికి రప్పించారు. గాలివీడు గ్రామానికి చెందిన రమణమ్మ సౌదీలో అనారోగ్యంతో బాధపడుతూ.. తన మనోవేదనను వీడియోకాల్ ద్వారా ఆమె భర్త ఆంజనేయులుకు తెలియజేసింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీని కలిసి తన భార్యను రక్షించి ఇంటికి రప్పించేలా చూడాలని వేడుకున్నారు. ఇందుకు వెంటనే స్పందించిన ఎస్పీ ఆమెను స్వదేశానికి రప్పించేలా ఏర్పాట్లు చేశారు. రమణమ్మను సౌదీ దేశానికి పంపిన ఏజెంట్‌ను పిలిపించి విచారించారు. ఏజెంట్ ద్వారా రమణమ్మను ఇండియాకు రప్పించేందుకు చర్యలు చేపట్టారు. తన సిబ్బందితో చేసిన ప్రయత్నాలు ఫలించడంతో రమణమ్మ సోమవారం సురక్షితంగా స్వగ్రామానికి చేరుకున్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధితురాలు రమణమ్మ, భర్త ఆంజనేయులు ఎస్పీని కలిసి ఆనందంతో ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం పోలీసుశాఖకు రుణపడి ఉంటామని తెలిపారు.

జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ బదిలీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప గాలేరు నగరి సుజల స్రవంతి (ఎస్‌కెడి జీఎన్ఎస్ఎస్) సూపరింటెండింగ్ ఇంజినీరుగా పని చేస్తున్న ఎం. మల్లికార్జున రెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు మరియు గాలేరు నగరి సుజల స్రవంతి సూపరింటెండింగ్ ఇంజినీరుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

'ఎక్సైజ్ నేరాలను కట్టడి చేయాలి'

కడప(క్రైం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ నేరాల కట్టడికి చర్యలు చేపట్టాలని, నాటు సారా తయారీ, బెల్టు షాపులపై నిఘా ఉంచాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు ఆదేశించారు. తన కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో సారా తయారు చేసే ప్రాంతాల్లో పరిశీలించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీ ముమ్మరం చేసి ఇతర రాష్ట్రలనుంచి వచ్చే మద్యం పట్టుకోవాలని సూచించారు. మద్యం దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకు విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

'మహిళల కోసం దృఢమైన చట్టాలు'

కడప(వినాయకనగర్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం రాజ్యాంగం దృఢమైన చట్టాలను రూపొందించిందని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ రాజేశ్ కుమార్‌రెడ్డి అన్నారు. వయోలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్‌ను పురస్కరించుకుని జాతీయ సేవా పథకం, ఆర్తీహోం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రిమ్స్ వైద్యురాలు వనజ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు అన్ని హక్కులు కల్పించారన్నారు. వివక్ష లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఆర్కి టెక్చర్ కార్యదర్శి దుర్గాకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆర్తీహోం సభ్యులు తేజ, విక్రమ్, జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారులు వరలక్ష్మి, ఉదయ్‌ప్రకాశ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహాలలో సౌకర్యాలు కల్పిస్తాం

కడప ఎడ్యుకేషన్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వైస్ చాన్స్‌లర్ కె.క్రిష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డితో కలసి ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల అవసరాలను అడిగి తెలుసుకుని.. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

విమర్శలే తప్ప చర్యలుండవు : తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో నాటి ప్రభుత్వ పెద్దలకు రూ.1750 కోట్లు లంచం ఆదాని ద్వారా ముట్టిందని అమెరికా ప్రభుత్వ సంస్థలు ఆధారాలతో సహా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాయని తులసిరెడ్డి పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ కానీ, అరెస్టు గాని, ఒప్పందాల రద్దు గాని ఏ చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొన్ని వేలకోట్ల రూపాయల సబ్సిడీ బియ్యం బ్లాక్ మార్కెటింగ్ జరిగిందని కూటమి ప్రభుత్వం ఊదరగొడుతోందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కూతల ప్రభుత్వం తప్ప చేతల ప్రభుత్వం కాదన తేటతెల్లమైందని తులసిరెడ్డి విరుచుకుపడ్డారు.

అరటి ఎగుమతులు మరింత పెరగాలి

- జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి

పులివెందుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నుంచి అరటి ఎగుమతులు మరింత పెరిగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మని జిల్లా ఉద్యాన అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి అన్నారు. మంగళవారం స్థానిక ఉద్యాన అధికారి కార్యాలయంలో అరటి ఎగుమతులపై వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం అరటి పంట ఎగుమతులు, వ్యాపారంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. పులివెం దుల అరటికి దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఎక్కువ డిమాండ్ ఉందని, అందుకు తగ్గట్లు పులివెందుల నుంచి ఆశించినంత ఎగుమతులు జరగడం లేదన్నా రు. కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి మాట్లా డుతూ అరటిలో నాణ్యతను పెంపొందిం చేందుకు, సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు క్షేత్రస్థాయిలో రైతు శిక్షణ కార్య క్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. అరటిని ఎగుమతి చేసేందుకు పులివెందులలో 600 ఎంటీఎస్ సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీ, 12ఎంటీఎస్ సామర్థ్యం గల ప్రీకూలింగ్ చాంబర్‌లు అందు బాటులో ఉన్నాయన్నారు. అరటిలో ఉప ఉత్పత్తులను ప్రోత్సహించేం దుకు పులివెందులలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌ను కూడా ఏర్పాటు చేశామని.. ఈఅవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పలువురు వ్యాపారులు మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాల వలన అరటి కాయల నాణ్యత దెబ్బతిందని... ఇతర దేశాల్లో ఆగస్టు నుంచి మార్చి 10 వరకు అరటి కాయలకు ఎక్కువగా డిమాండ్ ఉంటుందన్నారు. కానీ మన ప్రాంతంలో ఆ సమయంలో ఆశించినంత దిగుబడి అందుబాటులో ఉండదని తెలిపారు. సమస్యలను అధిగమించి ఎగుమతులు పెంచేం దుకు చర్యలు చేపడతామని జిల్లా ఉద్యాన అధికారి తెలియజేశారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



మహేంద్ర (ఫైల్‌ఫొటో)

వీరబల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు మండలంలోని దిగువరాచపల్లి గ్రామ పంచాయతీ నాయునివారిపల్లెకు చెందిన చిత్రాజు మహేంద్రనాయుడు (23) బెంగుళూరుకు వెళ్లి, ఓ మెడికల్ షాప్‌లో పని చేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. భార్య కాన్పు కోసం పుట్టింటికి వెళ్లగా.. ప్రస్తుతం తల్లి అతని వద్ద ఉంటోంది. ఆమె పించను కోసం స్వగ్రామానికి రాగా, ఆదివారం రాత్రి మహేంద్ర నాయుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మంగళవారం గ్రామానికి తీసుకు వచ్చారు. మృతుడికి భార్య మల్లీశ్వరి, రెండేళ్ల కూతురు, రెండు నెలల బాబు ఉన్నారు.

గొడవ కేసులో ఇద్దరికి రిమాండ్

ముద్దనూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో గొర్రెల దొంగతనం విషయంలో జరిగిన గొడవకు సంబంధించి మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఈశ్వరయ్య, శివశంకర్‌లను అరెస్టు చేసి, గొడవ సమయంలో ఉపయోగించిన బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

కాలుజారి కుందూ నదిలో పడి వృద్ధురాలు మృతి

చాపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామం వద్ద కుందూ నదిలో మంగళవారం మధ్యాహ్నం నూకనబోయిన సుబ్బమ్మ (70) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీ సుల వివరాల మేరకు.. అల్లాడుపల్లె గ్రామానికి చెందిన సుబ్బమ్మ నదిలో పూజ చేసేందుకు వచ్చి ప్రమాదశాత్తు కాలుజారి నీళ్లలో పడి గల్లంతయ్యింది. కొంత దూరం కొట్టుకుపోయి చిన్న నీటి గుంతలో ఇరుక్కుపోయి మృతి చెందింది. ఆదారిన పోయేవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కడప(క్రైం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పక్కీరుపల్లెకు చెందిన గజ్జె రంగయ్య అనే వ్యక్తి అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. రంగయ్య సత్యసాయి జిల్లా మడకశిర మండలంలో ఎంఎల్‌టీగా పని చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీ సోమవారం బ్యాంకుకు వెలుతున్నట్లు చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో భార్య సురేఖ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు టంగుటూరు విద్యార్థి




దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నందలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.దిలీప్‌కుమార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 29, 30లో టంగుటూరులో నిర్వహించిన రగ్బీ అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ పోటీలకు స్టాండ్‌బై నంబర్-1గా ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరు 25న పాట్నాలో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆ విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ గణేష్‌బాబు ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

బీడు భూమిలో గేదెలు మేపినందుకు మహిళలపై దాడి

ప్రొద్దుటూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీడు భూముల్లో గేదెలు మేపుకుంటున్న నలుగురు మహిళలపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన ఎర్రగుంట్ల పల్లెలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని సీతంపల్లె గ్రామానికి చెందిన తులశమ్మ, ఓబులమ్మ, గంగాదేవి, మాధవిలు ఎర్రగుంట్ల పల్లెలోని బీడు భూముల్లో గేదెలు మేపుకోవడానికి వెళ్లారు. భూ యజమాని వెంకటసుబ్బయ్య తన భూమిలో గేదేలు మేపడంపై మహిళలతో వాగ్వాదానికి దిగాడు. వారు తిరిగి మాట్లాడటంతో ఆ మహిళలపై కర్రతో దాడి చేసి గాయ పరిచాడు. బాధితురాలు తులశమ్మ ప్రొద్దుటూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు చాపాడు మండలం రామదాసుపురానికి చెందిన వెంటసుబ్బయ్యపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్వాక్రా మహిళలే... టార్గెట్



- ప్రభుత్వ అధికారులమంటూ బురిడీ
- జాగ్రత్త లేకుంటే ఖాతా ఖాళీనే
- సైబర్ నేరగాళ్ల నయా దోపిడీ

ఇలా మోసం చేస్తారు...

కడప కలెక్టరేట్ నుంచి మాట్లాడుతున్నాను.. మీరు లోను ఎంత తీసుకున్నారు.. ఇప్పటి వరకు ఎంత చెల్లించారు.. అంటూ డ్వాక్రాసంఘాల సభ్యులకు ఫోను చేసి.. మాటలు కలుపుతారు. ప్రభుత్వం కొత్త స్కీం పెట్టిందని.. మీ గ్రూపు సభ్యులకు ఆ డబ్బు జమ అవుతుందని నమ్మిస్తారు. తరువాత వారి ఖాతా వివరాలు తెలుసుకుంటారు.. మీ మొబైల్‌కు ఓటీపీ నెంబరు వచ్చింది.. ఒకసారి చూసి చెప్పమంటారు. కలెక్టరు కార్యాలయం అధికారి కదా.. అని నమ్మి వివరాలు చెప్పిన వెంటనే వారి ఖాతాలో ఉన్న సొమ్ము దోచేస్తున్నారు.



కడప క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేటి డిజటల్ ప్రపంచంలో ఒక్క క్లిక్‌తో ఏ సమాచారాన్నయినా సులభంగా యాక్సెస్ చేయవచ్చు. అయితే డిజిటల్ వినియోగం పెరిగిన కొద్దీ వాటిని ఆధారంగా చేసుకుని దోచుకునే నేరగాళ్ల సంఖ్య కూడా పెరుగుతుంది. ముఖ్యంగా డ్వాక్రా మహిళలే లక్ష్యంగా వీళ్ల అనేక నేరాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఇలాంటి మోసాలు ఎన్నో జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కొంత మంది మన జిల్లా వాసులను డబ్బులతో లొంగదీసుకుని వారి ద్వారా ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.

హలో.. కడప కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీరు డ్వాక్రా గ్రూప్ సభ్యులుగా ఉన్నారా అంటూ సైబర్ నేరగాళ్ల మహిళలకు ఫోన్ చేస్తారు. కలెక్టరు కార్యాలయం అనగానే... నిజమని వారి మాటలకు నమ్మి ఖాతా వివరాలు, ఓటీపీ నెంబర్లను చెబుతున్నారు. దీంతో మహిళల ఖాతా నుంచి డబ్బు కొట్టేస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల డ్వాక్రా మహిళలనే టార్గెట్ చేసుకుని ఈ దోపిడీకి పాల్పడుతున్నారు. కొంత మంది మహిళల అకౌంటులో తక్కువ అమౌంటు ఉన్నా కూడా వదలను పరిస్థితి.

వ్యక్తిగత, ఆర్థిక సమాచారం చెప్పవద్దు

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత, ఆర్థిక సమాచారం ఫోను ద్వారా ఇతరులకు చెప్పకూడదు. ఎవరికైనా చెబితే మీ ఖాతాలో నగదును కొట్టేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాట్సప్, స్కైప్ వంటి యాప్‌ల ద్వారా వివరాలు తెలుపకూడదు. ప్రభుత్వ అధికారులు కానీ బ్యాంకు అధికారులు కానీ ఫోన్లు చేయరని... అలా ఎవరైనా చేస్తే ఫోను ద్వారా సమాచారం చెప్పకుండా నేరుగా వెళ్లి వివరాలు తెలుసుకోవడం మంచిది. అనుమానాస్పద వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లకు, లింకులకు స్పందించకూడదు.. ఓటీపీ నెంబరు చెప్పకూడదు.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్

మోసపోయిన వారు వీరే..

- కడపకు చెందిన ఓ మహిళకు ఇటీవల సైబర్ నేరగాళ్ల నుంచి ఫోను వచ్చింది. కడప కలెక్టరేట్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ నమ్మించి ఆమె అకౌంటులో ఉన్న దాదాపు 50వేలు నగదును దోచుకున్నారు.
- ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన ఓ గ్రూపు సభ్యులకు ఫోను చేసి వాళ్ల వ్యక్తిగత వివరాలు తెలుసుకుని అకౌంటులోని నగదు లక్షల్లో దోచుకున్నారు.
- బద్వేలు ప్రాంతానికి చెందిన వ్యక్తి డ్వాక్రా మహిళలకు ఫోను చేసి అధికారి పేరుతో ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఆమె అకౌంటులో నుంచి దాదాపు రూ.30వేలు అపహరించారు.
- పులివెందుల ప్రాంతానికి చెందిన ఓ మహిళకు ఫోను చేసే అధికారుల పేరుతోనే ఆమె నుంచి ఖాతా, ఓటీపీ వివరాలు తెలుసుకుని దాదాపు రూ.20వేలు అపహరించారు. ఇలాంటి ఘటనలు ప్రస్తుతం ఎక్కువ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సైబర్ మోసాల పట్ల ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

వీఆర్‌ఏపై దాడి చేసిన వారిని శిక్షించాలి



ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

సిద్దవటం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏపై దాడిచేసిన వారిని శిక్షించాలంటూ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మండలంలోని వీఆర్‌ఏలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ భూ సమస్యపై విచారణ నిమిత్తం సోమవారం సాయంత్రం దేగలవారిపల్లెకు వెళ్లిన లింగంపల్లె వీఆర్‌ఏ కిషోర్‌పై నిమ్మకాయల ఓబుల్‌రెడ్డి దాడి చేశాడన్నారు. దీంతో గాయపడిన వీఆర్‌ఏ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. దళితుడైన వీఆర్‌ఏపై దాడి దుర్మార్గమన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటపతి, మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మాచుపల్లె వంతెనకు మోక్షమెన్నడో!

మాచుపల్లె వంతెన కోసం సిద్దవటం మండల వాసులు 37 ఏళ్లుగా కలలు కంటూనే ఉన్నారు. తొలిసారి పెన్నానదికి వరద వచ్చి పనులు నిలిచిపోగా, రెండోసారి పనులు హామీలకే పరిమితమయ్యాయి. కాగా తాము అధికారంలోకి వస్తే వంతెన పూర్తి చేస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ కూడా హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా మాచుపల్లె వంతెనకు సంబంధించి ఎలాంటి ఊసూ లేకపోవడంతో ఈ హామీ కూడా బుట్టదాఖలైందేమోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

సిద్దవటం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలం మాచుపల్లె ఖాదర్‌బంగ్లా మార్గంలోని పెన్నానదిపై అలుగు వారధి నిర్మాణం కోసం 1988 జులై 6న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేశారు. 1990లో కోటి రూపాయల వ్యవధితో వారధి నిర్మాణ పనులు ప్రారంభించారు. మాచుపల్లె వైపున పెన్నానదిలో కొంతవరకు పునాదులు కూడా తవ్వారు. పనులు ప్రాథమిక దశలో ఉండగా ఆకస్మికంగా పెన్నానదికి వరద వచ్చి నిర్మాణ సామగ్రి కొట్టుకుపోయింది. అనంతరం పనులు ముందుకు సాగక ఆ పనులు రద్దయ్యాయి. 2009 జనవరి 24న సిద్దవటం సమీపంలో పెన్నానదిపై నిర్మించిన వంతెన ప్రారంభోత్సవానికి విచ్చేసిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ. 16 కోట్లతో వంతెన నిర్మిస్తామని బహిరంగసభలో ప్రజలకు హామీ ఇచ్చారు. అప్పటి నుంచి నేటివరకు నిధులు మంజూరు కాలేదు. ఎన్టీ రామారావు ఆశయ సాధన టీడీపీ ప్రభుత్వంలోనే సాకారం అవుతుందని ప్రజలు, టీడీపీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో భాగంగా సిద్దవటం వచ్చిన నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వంతెన ఏర్పాటు చేస్తే రాష్ట్ర రాజధానికి వెళ్లడానికి ఈ మార్గం దగ్గరగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.





మాచుపల్లె వద్ద పెన్నానదిలో వంతెన నిర్మించాల్సిన ప్రాంతం (ఇన్‌సర్ట్) ఎన్టీరామారావు ప్రారంభించిన శిలాఫలకం

300 వైసీపీ కుటుంబాలు జనసేనలో చేరిక



జనసేన పార్టీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లేబాక గ్రామంలో రాజంపేట పార్లమెంట్ జనసేనపార్టీ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు సమక్షంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అన్నం నాగేంద్ర మూర్తితో పాటు 300 కుటుంబాలు మంగళవారం జనసేనపార్టీలో చేరాయి. టీవీపురం నుంచి ఉపసర్పంచ్ వై.వెంకటసుబ్బయ్య, లేబాక హరిజనవాడ మాజీ సర్పంచ్ లింగాల పెంచలయ్య, వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం నాయకులు నరసింహారెడ్డి, ఈగ రామకృష్ణారెడ్డి, అరవపల్లి నుంచి కోటా శ్రీనివాసులు, కోటా కళావతి, రాజంపేట పట్టణ వైఎస్ఆర్‌సీపీ టౌన్ ప్రెసిడెంట్ సారా రాజేష్‌లతో పాటు దాదాపు 300 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రైల్వేకోడూరు నాయకులు ఆలం రమేష్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, జనసేన నాయకులు గురువుగారి వాసు, ఆకుల చలపతి, వినయ్, ప్రశాంత్, జనసేన వీర మహిళ రెడ్డిరాణి, ఏటీవీపీ రెడ్డిచర్ల శివ, అభిమానులు పాల్గొన్నారు.

‘అన్నమాచార్య’ అధ్యాపకురాలు చెంగమ్మకు డాక్టరేట్



రాజంపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): అన్నమాచార్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పోలిచెర్ల చెంగమ్మ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జేఎస్, షీకోహాబాద్ యూనివర్సిటీల నుంచి పీహెచ్‌డీ అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌ప్లోరింగ్ ది ఇం పాక్ట్ ఆఫ్ ఏఐ ఆన్ రిమోట్ వర్క్ ఎఫిషియన్సీ అనే అంశంపై జేఎస్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు ఆధ్వర్యంలో పరిశోధన చేశారన్నారు. చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్. మల్లికార్జున రావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు అభినందించారు.

సామాజిక, ఆర్థిక అక్షరాస్యత సాధనే ‘ఉల్లాస్’ లక్ష్యం

● జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి

సంబేపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను సామాజిక, ఆర్థిక అక్షరాస్యులుగా మార్చడమే ‘ఉల్లాస్’ కార్యక్రమం లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి, ఎస్‌బీఐ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామచంద్ర అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. 15 నుంచి 76 ఏళ్లలోపు వయసున్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మారుస్తూ, సామాజికంగా, ఆర్థికంగా వారిని అభివృద్ధి చేయడం. చేతి వృత్తులను ప్రోత్సహించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. మూడేళ్ల పాటు ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఏపీఎం సంజీవరాజు పథకంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీవోఏ సభ్యులు హాజరయ్యారు. కాగా, ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు బహిష్కరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారు హాజరు కాలేదని అధికారులు తెలిపారు.

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో డ్వాక్రా, వీఓఏ మహిళలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరీశంకర్, ఏపీఎం మల్లికార్జునరాజు, ఏవో రేవతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు అనసూయ, గుణవతి, వెలుగు సీసీలు దాము, వెంకటసుబ్బమ్మ, గోవిందమ్మ, హరి, వైడీపీ ఏపీఎండీ రామచంద్రయ్య, ఎల్‌సీ హరి, డ్వాక్రా వీఓఏలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

రాజంపేట : అంగన్వాడీ కార్యకర్తలను వయోజన విద్య విధులు అప్పగిస్తున్నందుకు నిరసనగా మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఇప్పటికే పనిభారంతో సతమతమవుతున్న తమకు వయోజన విద్య బాధ్యతలు అప్పగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నేతలు విజయమ్మ, ఈశ్వరమ్మ, అమరావతి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సంబేపల్లె: సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

చెత్త నుంచి సంపద సృష్టించాలి

సంబేపల్లె, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నారాయణరెడ్డిపల్లె, సంబేపల్లె, దేవపట్ల గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు వినియోగంలోకి తెస్తే గ్రామ పంచాయతీల ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చెత్త నుండి సంపదను సృష్టించే విధంగా ఏర్పాట్లు చేయాలని సెక్రటరీలకు తెలియజేశారు. పంచాయతీల ఆదాయం పెంపొందించడంపై దృష్టి సారించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు వండాడి రవీంద్ర, మోహన్‌బాబు, దేవపట్ల, గున్నికుంట్ల పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

రామాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ గాండ్లపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తాగునీటి బోరు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీకే రోడ్డు నుంచి నీలకంఠ్రావుపేట వరకు తారు రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో తాగునీరు, ల్యాబ్‌లో పరికరాల సమస్య పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

6 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు

రాజంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 6 నుంచి 9 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంఆర్వో పీర్‌మున్నీ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 6న ఎంజీపురం, 7న తాళ్లపాక, 8న హస్తవరం, 12న గుండ్లూరు, 13న మందపల్లె, 17న శేషామాంబపురం, 18న పులపత్తూరు, 19న ఆకేపాడు, 20న శ్రీరంగరాజపురంలో సదస్సులు జరుగుతాయన్నారు. 21న బ్రాహ్మణపల్లె, 24న మన్నూరు, 26న బైరాజుపల్లె, 27, 28న రాజంపేట, 31న మిట్టమీదపల్లెలోని గ్రామ సచివాలయాల్లో జరుగుతాయన్నారు. జనవరి 2న గోపమాంబపురం, 3, 4 తేదీల్లో పోలి, 7న ఊటుకూరు, 8న రోళ్లమడుగు, బుడుగుంటపల్లె, 9న సీతారాంపురం, కిచ్చమాంబపురంలో ఈ సభలు జరుగుతాయని ఆమె తెలిపారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకుడు శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయం ఎదుట ప్రజలతో కలసి ఆందోళన చేశారు. బతుకుదెరువుకోసం పట్టణాలకు వచ్చి అద్దె ఇళ్లలో ఉంటున్న నిరుపేదలకు పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి నివాస స్థలాలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సుమిత్ర, ప్రమీల ఓబులేసు, గణేష్ పాల్గొన్నారు

పింఛా నది పరిసరాలకు వెళ్లొద్దు



ప్రజలను హెచ్చరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు నది పరివాహక ప్రాంతాల్లోకి ప్రజలెవరూ వెళ్లకూడదని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు దిగువ భాగంలో నది పరివాహక ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పింఛా ప్రాజెక్టు నిండడంతో దిగువకు నీరు విడుదల చేసినందున నది వద్దకు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఏ క్షణాలైనా పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎండీయూ ఆపరేటర్‌పై ఫిర్యాదు



ఎండీయూ ఆపరేటర్‌పై ఫిర్యాదు చేస్తున్న పూలుకుంట గ్రామస్తులు

గాలివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చక్కెర, కందిబేడలకు అధిక ధర వసూలు చేయడంతోపాటు, ఎండీయూ వాహనంపై జగన్ బొమ్మను తొలగించలేదంటూ మండలంలోని మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్-9 ఆపరేటర్ ఈశ్వర్‌రెడ్డిపై పూలుకుంట గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. సరుకులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ఎందుకు తీసుకుంటున్నావంటూ కార్డుదారులు అభ్యంతరం తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీ షాప్ డీలర్లు టోపీవలి సాహెబ్, రెడ్డెప్పరెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కొండారెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై చర్యలు తప్పవు

సిద్దవటం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం సిద్దవటం పోలీసుస్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాచుపల్లె, దేగనవారిపల్లె, నేకనాపురం తదితర గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేశామని, ఎటువంటి గొడవలు చేసినా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఐ చిరంజీవి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నందలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజంపేట పరిధిలోని మండలాల్లో మంగళవారం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించినట్లు రాజంపేట డివిజన్ కన్వీనర్ షేక్ రౌఫ్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలకు 200 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచినవారికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి 12 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందుతుందని తెలిపారు. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని డీఆర్ఎంకు వినతి



డీఆర్ఎంను సత్కరిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

రాజంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో రైల్వే అండర్‌బ్రిడ్జిని పూర్తి చేయాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరుతూ గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ వినయ్‌కుమార్‌కు రైల్వే బోర్డు సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గుంతకల్‌లోని కార్యాలయంలో మంగళవారం ఆయన డీఆర్ఎంను కలిశారు. రాజంపేట రైల్వే అండర్‌బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వేకోడూరు సమీపంలోని రామాయపాలెం వద్ద అండర్‌బ్రిడ్జిలో నీరు నిలుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజంపేట రైల్వే స్టేషన్‌లో జయంతి ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ కేంద్రమైన రాజంపేటలో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగకపోవడం వల్ల ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుక్కలదొడ్డి సర్పంచ్ గంజి పూర్ణయ్య, రమణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎంను సత్కరించారు.

‘ఉపాధి’ని వ్యవసాయానికి అనుసంధానం చేయండి

సిద్దవటం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని పెద్ద పల్లి సర్పంచ్ తుర్రా చిన్నక్క డిమాండ్ చేశారు. ఆ గ్రామ సచివాలయంలో మంగళవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. పూడిక పనులు, బావి పనులు, వంక పనులతో వన్యప్రాణుల దాహం తీరడంతోపాటు, చెరువులు నిండి రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఏపీవో నరసింహులు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీ బ్యాంక్ ఉద్యోగులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ అధికారి వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు తమ బ్యాంక్ సేవలపై ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 660 రోజులకు 8.35 శాతం వడ్డీ, సాధారణ ప్రజలకు 7.85 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. బంగారం, స్థిరాస్తుల తాకట్టుపై అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నామన్నారు. గృహ నిర్మాణాలకు, చిరువ్యాపారులకు, స్వయం సహాయ క సంఘాలకు రుణాలు ఇస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేష్, రమణయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గాలివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దుర్గేశ్వరరాజు మాట్లాడుతూ దివ్యాంగులను ప్రేమ, అనురాగం, శ్రద్ధతో అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సౌకర్యాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ నారాయణమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: కొత్తమాధవరం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక సచివాలయంలో పంచాయతీ సెక్ర టరీ సుధాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు హరినాథ్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

పుల్లంపేట: స్థానిక ఎస్‌టీవీడీ ప్రాంగణంలో దివ్యాంగుల సంఘం స్థానిక అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి, రాజంపేట అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్‌తో ఎంఈవో నాగతిరుమలరావు సమావేశమై ఈనెల 12న రాజంపేటలో నిర్వహించే ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఏర్పాట్లపై చర్చించారు.

ఉత్తమ కేడెట్లకు అభినందన

చిట్వేలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ డివిజన్ విభాగంలో ఉత్తమ కేడెట్లుగా ఎంపికైన షేక్ మొజాహిద్, పులి దిలీప్‌కుమార్‌ను హెచ్ఎం ఏటీఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ అభినందించారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అభినందనసభలో రాజశేఖర్ మాట్లాడుతూ శనివారం కడపలోని బెటాలియన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ విద్యార్థులు ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి చేతులమీదుగా ఎన్‌సీసీ డీడీజీ జ్ఞాపికను అందుకున్నారన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

రైల్వేకోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా గిరిజనుల తలరాతలు మారలేదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం. జయరావయ్య, ఎం. రమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రైల్వే కోడూరు మండలం వీవీ కండ్రిక పంచాయతీ పరిధిలో ఉన్న వినాయకనగర్ గిరిజనకాలనీని సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక గిరిజన కాలనీలో రోడ్లు, వీధిలైట్లు, పక్కాగృహాలు లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ అంగన్వాడీ స్కూలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రికి వెళ్లాలంటే సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రైల్వే కోడూరుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఆధార్ కార్డులు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులుగా తుపాకుల లక్ష్మీదేవి, కార్యదర్శిగా చర్ల రాజేశ్వరమ్మ, సహాయ కార్యదర్శులుగా నగిరిపాటి నరేష్, తుపాకుల పోలయ్య, పిరమిట్ల సుబ్బయ్య, యాకసిరి సుబ్బమ్మ, మల్లికార్జున, గువరయ్య, చిక్కోలు మహేష్‌తో పాటు 13 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి



ఈటమాపురం వంతెన కింద ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజనేరు

పెనగలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ మండలాల్లో భారీ వర్షం కురవడంతో గుంజనేటిలో వరద ఉధృతి కొనసాగుతోంది. వెలగచర్ల సమీపంలోని అలుగుపైన రెండు అడుగుల మేర నీరు పారుతోంది. దాంతో వెలగచర్ల, ఉప్పరపల్లె, అగ్రహారం గ్రామాలకు వెళ్లే విద్యార్థులు వాహనాల్లో ఈటమాపురం హైవే వంతెనపై వెళుతున్నారు. పాడి రైతులు పశువులను మేతకు తీసుకెళ్లకుండా ఇంటివద్దే మేపుకుంటున్నారు.

పెరాలసిస్ బాధితుడికి ఆర్థికసాయం

ఓబులవారిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి హైదరాబాదులో ఉంటున్న నాగశివశంకర్‌రెడ్డి మంగళవారం ఆర్థిక సాయం చేశారు. చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ అయ్యలరాజుపల్లె హరిజనవాడకు చెందిన దాసరి సుబ్రమణ్యం పక్షవాతంతో బాధపడుతున్నాడు. ప్రస్తుత వర్షాల కారణంగా ఆయన నివాసముంటున్న ఇంటి పైకప్పు కూలిపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన గ్రామంలోని తన సన్నిహితుల ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. బాధితునితో మాట్లాడి గృహనిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు. చిన్నయ్య, సుబ్బన్న, రఘు, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ఇళ్ల నిర్మాణాలెలా...?

- చౌడు భూమి.. ఊట స్థలంలో లేఅవుట్లు
- జగనన్న కాలనీలు.. అధ్వానం
- వైసీపీ వైఖరితో ఆగిన పక్కా గృహనిర్మాణాలు
- పక్కాగృహాలు కట్టేందుకు జంకుతున్న జనం

పెద్దమండ్యం, వెలిగల్లు లేఅవుట్లలో..

మంజూరైన పక్కాగృహాలు	208
పునాది దశలో ...	60
బేస్‌మెంట్ వరకు...	52
మోల్డింగ్ దశలో...	24
మోల్డింగ్ పూర్తయినవి	02
నిర్మాణం పూర్తయినవి	19

పెద్దమండ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో జనం కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇంటి పట్టాలు సంబరంగా పంపిణీ చేశారే కానీ.. కాలనీలు ఎంచుకున్న ప్రదేశాలు సరైనవి కావని లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 11 జగనన్న కాలనీలు ఉన్నాయి. అందులో పెద్దమండ్యం, వెలిగల్లు, తురకపల్లె జగనన్న కాలనీలు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఇచ్చిన వాటిలో సగానికి పైగా పునాది దశలోనే ఉన్నాయి. పెద్దమండ్యం, వెలిగల్లు లేఅవుట్లలో 208 పక్కాగృహాలు మంజూరు చేయగా కేవలం 19 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి పునాది దశలో, మోల్డింగ్ దశలోనే ఉన్నాయి. ఇక తురకపల్లె జగనన్న కాలనీలో ఇప్పటి వరకు ఒక రాయి కూడా పడలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. వైసీపీ ప్రభుత్వం వైఖరి వల్ల రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేకపోవడం కూడా కారణంగా చెప్పవచ్చు.

పెద్దమండ్యం పట్టణం సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఠాణా ప్రాంతంలో చౌడు ఊట స్థలంలో ఏర్పాటు చేశారు. వర్షకాలంలో ఈ కాలనీలో మనుషులు తిరగడమే కష్టం. మరి ఇటువంటి చోట గృహ నిర్మాణాలు ఎలా చేయాలంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ వెళితే తిరిగి రావడం కష్టమే. ఇక వెలిగల్లు గ్రామానికి ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో ఉన్న జగనన్న కాలనీ విషయానికొస్తే.. గ్రామస్తులు నిరాకరించినా కాలనీ ఏర్పాటు చేశారు. పాపేపల్లి గ్రామ పంచాయతీ పి.తురకపల్లి నదీ ప్రవాహ ప్రాంతంలోని ఊట నీరు ప్రాంతంలో లేఅవుట్ ఏర్పాటు చేశారు. కానీ అక్కడ ఒక్క లబ్ధిదారుడు కూడా పక్కా గృహం నిర్మించుకోవడానికి సుముఖత చూపలేదు.



పెద్దమండ్యంలో నిర్మాణాలకు నోచుకోని జగనన్న కాలనీ

అమ్మో... ఆ కాలనీల్లోనా..!

పెద్దమండ్యం పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఠాణా ప్రాంతం అంటేనే చౌడు భూములు. వర్షాకాలంలో మనుషులు కూడా తిరగలేని భూములని అందరికీ తెలుసు. కానీ హడావిడిగా రెండు దశల్లో పెద్దమండ్యం పట్టణ జగనన్న కాలనీలో 175 ప్లాట్లతో జగనన్న కాలనీ లేఅవుట్ వేశారు. నీరు, కరెంట్, కాలనీలో వెళ్లలేని పరిస్థితి ఉన్నా విధిలేని పరిస్థితుల్లో చౌడు భూమి స్థలాల్లోనే ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు పునాది వేశారు. ఆ కాలనీ పేర్లు చెబితేనే అమ్మో.. అంటున్నారు. పునాదులు తవ్వే సమయంలో పునాది గుంతల్లో నీరొచ్చినా సాహసించి నిర్మాణాలు చేపట్టారు.

నీటి కోసం బోరు వేసినా, విద్యుత్తు కోసం స్తంభాలు నాటినా కనెక్షన్ ఇవ్వలేదు. అతి కష్టం మీద చౌడు భూముల్లో నిర్మాణ సామగ్రి తరలించారు. అంతేకాకుండా ఈ ప్రాంతం చెరువుకట్ట కింద ఉండడంతో పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఊట స్థలంలో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపడతారని పలువురు లబ్ధిదారులు ప్రశ్నించారు. ఊట నీరు లేఅవుట్‌లోకి రాకుండా అడ్డంగా కాలువ నిర్మాణం చేశారు. వెలిగల్లు గ్రామానికి ఒకటిన్నర కి.మీ. దూరంలో 111 ప్లాట్‌లతో జగనన్న కాలనీలో రెండు లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అక్కడ మూడు పక్కాగృహాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇక్కడ ప్లాట్ల కేటాయింపులో అనర్హులకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పాపేపల్లి గ్రామ పంచాయతీ పి.తురకపల్లి సమీపంలో చౌడు భూమిలో ఊటనీరు నదీ ప్రవాహ ప్రాంతంలో 41 ప్లాట్లతో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇక్కడ పక్కాగృహాల నిర్మాణాలకు లబ్ధిదారులు చొరవ చూపలేదు.

ఆందోళన కలిగిస్తున్న నిబంధనలు

ఈ ఏడాది డిసెంబరులోపు పక్కాగృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారు. ఈ నిబంధనలతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. మన ఇళ్లు-మన గౌరవం అనే కార్యక్రమాలు జరిగాయి. గత వారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో డిసెంబరు నెలలోపు పక్కాగృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈ వెంకటరెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు తెలపడంతో గుబులు రేగుతోంది. నిర్మాణ సామగ్రి ధరలు రెట్టింపు కావడంతో నిర్మాణాలు తమ వల్ల కాదని కొందరు తేల్చి చెప్పారని తెలుస్తోంది.

త్వరలోనే సదుపాయాలు కల్పిస్తాం

- అక్రమ్, ఏఈ, హౌసింగ్

జగనన్న కాలనీల్లో రోడ్లు, నీరు, విద్యుత్తు సౌకర్యం కల్పనకు ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సదుపాయాలు కల్పిస్తాం. ఇవి లేకనే ఇళ్లు కట్టుకోలేక పోతున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు. వీటిపై ఉన్నతాధికారులతో మాట్లాడి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాము.



వెలిగల్లు జగనన్న కాలనీలో నిర్మాణాల పరిస్థితి

ఈ-ప్రగతి నుంచి పరివాహన్

వాహన సేవల వెబ్‌సైట్ పేరు మార్పు : జిల్లా రవాణా అధికారి



సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారుల సేవలను గత ప్రభుత్వంలో ఉన్న ఈ-ప్రగతి వెబ్‌సైట్‌ను పరివాహన్ పేరుతో మార్చినట్లు అన్నమయ్య జిల్లా రవాణా అధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో వాహనదారులు వారికి అవసరమైన సేవలు పొందేందుకు లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు తదితర వాటి కోసం ఈ-ప్రగతి వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసేవారన్నారు. అయితే ఇకపై పరివాహన్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని వాహన సేవలు పొందాలని ఆయన సూచించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. అలాగే పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 64 చోట్ల బ్లాక్ స్పాట్స్ గుర్తించి అక్కడ ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు చేపడుతున్నామన్నారు. అంతేగాక వాహనదారులు కూడా ట్రాఫిక్ నియమ నిబంధనలను, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ అన్నమయ్య జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తయారు చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇకపై వాహన సేవలను ఈ-ప్రగతి వెబ్‌సైట్‌లో కాకుండా పరివాహన్ అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసి వారికి అవసరమైన వాహన సేవలను పొందాలని ఆయన సూచించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ శాఖలన్నీ పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, వాటిని అర్థం చేసుకుని జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గత కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సీపీవో వెంకటపెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 6వ తేదీ నుంచి జరగబోయే రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మండల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఏ తేదీల్లో ఏ గ్రామంలో సదస్సును నిర్వహించబోతున్నారో ముందుగా ప్రకటన ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, సమన్వయంతో సదస్సులను నిర్వహించాలని ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ భూముల రీవెరిఫికేషన్ నివేదికలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే విధానం, నీటి పన్నుల మాడ్యుల్‌పై 4వ తేదీ వీఆర్‌వోలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఆర్‌వోను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో సీటులోనే ఇరుక్కుపోయిన అష్రఫ్

వాల్మీకిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం వేకువజామున వాల్మీకిపురం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..కలికిరి పట్టణంలోని శివాలయంవీధికి చెందిన అబ్దుల్లా కుమారుడు అష్రఫ్ (27)మంగళవారం వేకువజామున బెంగళూరు నుంచి కలికిరికి కారులో వెళ్తుండగా వాల్మీకిపురం మండలంలోని టీఎం వ్యాలీ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అష్రఫ్ అక్కడికక్కడే మృతి చెంది సీట్‌లోనే ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో అష్రఫ్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా టీఎం వ్యాలీ సమీపంలో జాతీయ రహదారిలో వర్షాలు కురిసే సమయంలో రోడ్డు జారుడు స్వభావంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు దృష్టి సారించి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నమయ్య జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ మంగళవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పరిధిలోని మదనపల్లె-1టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న అన్వర్‌బాషను అన్నమయ్య డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న కేబీ శివకుమార్‌ను మదనపల్లె-1టౌన్ పీఎస్‌కు, మదనపల్లె-2 టౌన్ పీఎస్‌లో ఉన్న రవికుమార్‌ను పీటీయం పీఎస్‌కు, పీటీయం పీఎసీలో ఉన్న ఎంకే నరసింహులును ములకలచెరువు పీఎస్‌కు, ములకలచెరువు పీఎస్‌లో ఉన్న గాయత్రిని మదనపల్లె-2టౌన్‌కు, అన్నమయ్య డీపీటీసీలో ఉన్న రమేశ్‌బాబును అన్నమయ్య డీఎస్‌బీ-2లోకి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు.

వామ్మో... తిరుపతి రోడ్డా...!

- ఈ రోడ్డులో ప్రయాణమంటేనే హడలిపోతున్న ప్రయాణికులు
- వర్షాలతో రోడ్డంతా గుంతలే



గుంతలమయమైన రైల్వేకోడూరు-తిరుపతి రోడ్డు

రైల్వేకోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోడూరు-తిరుపతి మార్గమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. అడుగుతో గుంత చొప్పున ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అవి మరింత పెద్దవై ఆ గుంతల్లో చిన్న వాహనాల టైర్లు పడితే పైకి లేచే పరిస్థితి లేకుండా తయారయ్యాయి. తిరుపతి మార్గం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. అలాగే కడప, రాజంపేట మార్గం కూడా రద్దీగానే ఉంటుంది. ఎక్కువగా హైదరాబాద్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్నూలు తదితర నగరాల నుంచి తిరుమలకు వస్తుంటారు. గుంతలు పడిన రోడ్డులో వాహనాలు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు అంటున్నారు. రైల్వేకోడూరు మండలంలోని శాంతినగర్ నుంచి తిరుపతి వరకు ప్రధానదారి పూర్తిగా గుంతలమయంగా మారిపోయింది. అదే విధంగా రైల్వేకోడూరు నుంచి కడప వరకు గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుంతలు పూడ్చే కార్యక్రమం క్రింద కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసింది. అయినా రైల్వేకోడూరు-తిరుపతి, రైల్వేకోడూరు-కడప మార్గం లో చిన్న, చిన్న గుంతలను పూడ్చి ఉండి ఉంటే పెద్ద గుంతలు పడేవి కావని ప్రయాణీలు అంటున్నారు. రైల్వేకోడూరు నుంచి ఎక్కువగా తిరుపతి కి ఉద్యాన పంటలు ఎగుమతి అవుతుంటాయి. వీటిని తీసుకుని పోవాలంటే నరకయాతన పడుతున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే గర్భిణులు ప్రసవించే విధంగా రోడ్లు మారాయి. ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద, పెద్ద గుంతల వద్ద హెచ్చరిక బోర్డులను తాత్కాలికంగా పోలీసులు ఏర్పాటు చేశారు. వాహనాలు సకాలంలో తిరుపతి, రాజంపేట, కడప తదితర ప్రాంతాలకు చేరుకోలేక ఉన్నాయి. అంబులెన్సులు కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, రైల్వేకోడూరు నుంచి తిరుపతి వెళుతుంటాయి. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయో అని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని రోడ్లు బాగు చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

కడపకు మూడు గంటలు పడుతోంది



గుంతలతో కడప కు ప్రయాణించాలంటే సుమారు 3 గంటలకు పైగా సమయం పడుతుంది. గుంతలు లేని సమయంలో రైల్వేకోడూరు నుంచి కడప కు రెండు గంటల సమయం పడుతుండేది. ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది.

-చెన్నంశెట్టి వెంకటరమణ, వ్యాపారి, రైల్వేకోడూరు

ఎక్కడ చూసినా గుంతలే...



చిన్న, చిన్న గుంతలు ఏర్పడినప్పుడే సరి చేసి ఉంటే ఇటు వంటి పరిస్థితి రాకుండా ఉండేది. ఎక్కడ చూసినా గుంతలు కనిపిస్తున్నాయి. ఒక్క గంటలో తిరుపతి వెళ్లే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. వెంటనే గుంతలు పూడ్చి రోడ్లు వేయాలి.

- విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు, ముక్కావారిపల్లె

నరకయాతనే...



రైల్వేకోడూరు నుంచి తిరుపతికి వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నాము. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని భయపడుతున్నాము. గుంతలను చూస్తుంటే భయమేస్తోంది. కార్లు ఎక్కడ దెబ్బతింటాయని ఆందోళన ఉంది. వెంటనే గుంతలను పూడ్చి కొత్తగా రోడ్లు వేయాలి.

- సిద్దిలింగం మురళీక్రిష్ణ, రైల్వేకోడూరు

ఎంఎస్ఎంఈ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎంఎస్ఎంఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఐపీవో (ఇండియన్ ప్రోజెన్ ఆఫీసర్) శంకర్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సీసీలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల వివరాలను సచివాలయ సిబ్బంది చేపడుతున్నారని, ఇందులో ఎటువంటి మోసాలు లేవని ఇది పూర్తిగా ప్రభుత్వం చేపడుతున్న సర్వే అని ఈ సర్వేకు అందరూ సహకరించాలన్నారు. ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరిస్తారని, ఆయా సభ్యుల ఫొటోలను యాప్ ద్వారా తీసి ఈ యాప్‌లో నమోదు చేస్తారని, గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకారం ప్రతి ఒక్కరికీ ఆధార్ లింక్‌తో బ్యాంకు అకౌంట్ ఉంటే ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. ఈ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకుంటే తద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాలను పొందవచ్చన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు ప్రజలకు వివరించి ఈ యాప్‌ల్లో సర్వే చేసుకునేందుకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఈవోపీఆర్డీ యోగానంద్, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, కొండా శివప్రసాద్, వెలుగు సీసీలు బావాజాన్, రామాంజులుతో పాటు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐదు నెలల ఉపాధి పనుల పరిశీలన

- ఎంపీ ఫిర్యాదుతో బృందాలు ఏర్పాటు చేస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు
- 2019 నుంచి జరిగిన పనులపై కూడా విచారణ జరపాలని టీడీపీ డిమాండు

కలికిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏప్రిల్ నెల నుంచి జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు చేసుకుంటున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లాలోని కలికిరి, చిత్తూరు జిల్లాలోని రొంపిచెర్ల, సోమల మండలాల్లో కూలీలు లేకుండానే యంత్రాలతో పనులు చేసినట్లు ఎంపీ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని పైన పనులను పరిశీలించి నివేదిక పంపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ఆయా డ్వామా పీడీలను ఆదేశించారు. డైరెక్టరు ఆదేశాల మేరకు కలికిరి మండలంలో జరిగిన పనులను పరిశీలించేందుకు నాలుగు టీములను ఏర్పాటు చేస్తూ డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని అద్దవారిపల్లె, చీకటిపల్లె, గుండ్లూరు, గుట్టపాళెం పంచాయతీల్లో పనులను పరిశీలించడానికి రాజంపేట ఏపీడీ ఎం.ప్రతాప్ ఆధ్వర్యంలో ఒక బృందం, కలికిరి, మర్రికుంటపల్లె, మేడికుర్తి, మునేళ్ళపల్లె పంచాయతీల్లో పరిశీలించడానికి రాయచోటి ఏపీడీ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పారపట్ల, పత్తేగడ, సంద్రావారిపల్లె పంచాయతీలకు కలికిరి ఏపీడీ ఎస్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో... అలాగే మొరంకిందపల్లె, మహల్, పల్లవోలు పంచాయతీల్లో పనుల పరిశీలనకు తంబళ్లపల్లె ఏపీడీ ఎస్.మధుబాబు ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటు చేశారు.

నేటి నుంచి పనుల పరిశీలన

నాలుగు టీములకు సంబంధించిన కొంత మంది మంగళవారం కలికిరిలో గత ఐదు నెలలుగా జరిగిన పనుల జాబితాలను సేకరించారు. బుధవారం నుంచి క్షేత్ర స్థాయిలో పనులు జరిగిన తీరుతెన్నులను పరిశీలించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ నుంచి 14 పంచాయతీల్లో రూ. 5.94 కోట్లను కూలీలకు పంపిణీ చేశారు. 2,09,450 పనిదినాలు నమోదయ్యాయి. గృహ నిర్మాణాలు, పండ్లతోటల వంటి పనులకు రూ.1.52 కోట్లు మెటీరియల్స్ కోసం ఖర్చు పెట్టారు. ఏప్రిల్, మే నెలల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు జరిగాయి. మొత్తం ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకూ చెల్లింపులు జరిగిన పనులన్నింటినీ పరిశీలిస్తారా లేక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జూన్ నెల నుంచి జరిగిన పనులను మాత్రమే పరిశీలిస్తారా అనే విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

2019 నుంచి జరిగిన పనులపై విచారణ చేయాలి

కాగా వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఐదేళ్లపాటు జరిగిన పనులన్నింటి పైనా విచారణ చేయాలని టీడీపీ డిమాండు చేసింది. ఈ మేరకు మంగళవారం విచారణకు వచ్చిన అధికారులకు మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం జరిగే విచారణపై తమకు అభ్యంతరం లేదని అయితే గత ఐదేళ్లలో జరిగిన పనులన్నింటిపై కూడా విచారణ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



2019 నుంచి జరిగిన పనులపై విచారణ జరపాలని వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పారిశ్రామికవేత్తలుగా... పేద మహిళలు

- లబ్ధి పొందనున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు
- 52 సంఘాలకు రూ.8.52 కోట్ల రుణాలు
- 308 మందికి జీవనోపాధులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలుగా మొదలైన మహిళా సంఘాలు నేడు పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదుగుతున్నాయి. సంఘాల్లో సభ్యులుగా చేరిన మహిళలు తాము దాచుకున్న సొమ్ముతో చిన్నపాటి వ్యాపారంతో ఉపాధి ఏర్పాటు చేసుకుని జీవనం సాగించడం మరికొంతమందికి స్ఫూర్తి కలిగిస్తుంది. తీసుకున్న రుణం తిరిగి సకాలంలో చెల్లిస్తుండడంతో బ్యాంకు అధికారులు మహిళా సంఘాలకు రుణం ఇచ్చి ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్నారు. సంఘాల్లోని సభ్యుల తపన చూసిన ప్రభుత్వం వారికి మరింత మెరుగైన జీవనోపాధులు కల్పించేందుకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దీంతో ఇప్పటి వరకు వ్యాపారం చేస్తున్న మహిళలు పరిశ్రమలు స్థాపించి.. మరికొంత మందికి ఉపాధి కల్పించే దిశగా తయారు చేస్తున్నారు. దీంతో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వ్యాపార లావాదేవీలపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉన్నతాధికారులు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థఅధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

మహిళల్లో ఆర్థిక స్థోమత పెంచేందుకు చర్యలు

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు.. వారి స్థోమత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వారి అభిరుచులకు అనుగుణంగా వివి.ద రంగాల్లో వ్యాపారం విస్తరించుకోవడంతో పాటు మరికొంతమందికి ఉపాధి కల్పించేదిశగా ఔత్సాహికులను ప్రోత్సహించడం జరుగుతుంది. ఇప్పటికే యూనిట్లు స్థాపన కోసం రుణం మంజూరుకు బ్యాంకు అధికారులతో సంప్రదించడం జరిగింది.

-సుబ్బారెడ్డి, డీపీఎం, జీవనోపాధుల విభాగం

52 సంఘాలు గుర్తింపు

జిల్లాలో 1,121 గ్రామ సమాఖ్యల పరిధిలో 27,622 స్వయం సహాయక సంఘాలున్నాయి. అందులో 2,82,526 మంది సభ్యులున్నారు. వీరి నుంచి జిల్లాలో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 52 స్వయం సహాయక సంఘాలను అధికారులు గుర్తించారు. వీటి ఏర్పాటు కోసం అవసరమైన ఆర్థికసాయం అందించేందుకు బ్యాంకు అధికారులతో చర్చలు జరిపి రుణం మంజూరు చేయిస్తున్నారు. ఇందులో కోటి రూపాయల పైన పెట్టుబడి పెట్టే పరిశ్రమలు ఉన్నాయి. మొత్తం 52 సంఘాలకు రూ.8.52 కోట్లు వివిధ బ్యాంకుల ద్వారా రుణం అందించనున్నారు. ఇవి ఏర్పాటు అయితే 308 మందికి ఉపాధి లభిస్తుంది.

- మైదుకూరు మండలంలోని విశ్రుతిరెడ్డి అనే మహిళకు డెయిరీ ఏర్పాటు కోసం రూ.కోటి 60 లక్షలు రుణం మంజూరు చేశారు.
- ఖాజీపేట మండలంలోని కోటేశ్వరమ్మ అనే మహిళకు రైస్‌మిల్లు ఏర్పాటు కోసం రూ.కోటి రుణం ఇవ్వనున్నారు.
- కలసపాడు మండలంలోని నారపురెడ్డి వెంకటసుధ బేకరీ పరిశ్రమ ఏర్పాటు కోసం రూ.40లక్షలు రుణం మంజూరు కానుంది.
- కలసపాడు మండలంలోని ఒక మహిళా సభ్యురాలు తన కుటుంబసభ్యులు మరమరాలు తయారీ పరిశ్రమ స్థాపన కోసం రూ.35లక్షలు మంజూరు చేయనున్నారు.
- ఒంటిమిట్ట మండలంలోని యనమల సుధామణి అనే మహిళ వాటర్‌ప్లాంటు ఏర్పాటు కోసం రూ.20లక్షలు రుణం మంజూరుకు ప్రతిపాదించారు.
- పోరుమామిళ్ల మండలంలోని ఓ సభ్యురాలు కుటుంబంలోని వ్యక్తి అబ్దుల్ సత్తార్ పండ్లరసం తయారీ పరిశ్రమకు రూ.25లక్షలు కేటాయించనున్నారు.



బేకరీ పరిశ్రమను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ (ఫైల్)

రౌడీషీటర్ పప్పీ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురయిన రౌడీషీటర్ పప్పీ అలియాస్ కొప్పల రాఘవేంద్ర (36) హత్యకేసును వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి నేతృత్వంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులోని నిందితులు యనమల లోకేష్‌రెడ్డి, సునీల్ రెడ్డిలను పట్టుకోవడానికి వారి స్నేహితుల ఇళ్లకు వెళ్లి పోలీసులు విచారించారు. లోకేష్‌రెడ్డి ఫోన్‌కాల్స్ ఆధారంగా ఆరా తీశారు. కాగా, మంగళవారం మధ్యాహ్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పప్పీ మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. పప్పీ మృతదేహాన్ని చూడటానికి పెద్ద ఎత్తున యువకులు జిల్లా ఆసుపత్రిలోని పోస్టుమార్టం గది వద్దకు చేరుకున్నారు. సాయంత్రం కుటుంబసభ్యులు, స్నేహితులు పప్పీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్పీ చొరవతో సౌదీ నుంచి మహిళకు విముక్తి

- గాలివీడుకు చేరుకున్న బాధితురాలు రమణమ్మ

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం సౌదీ అరేబియా దేశం వెళ్లి.. అక్కడ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నీరుగట్టు రమణమ్మ అనే మహిళను అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేక చొరవ చూపి స్వదేశానికి రప్పించారు. గాలివీడు గ్రామానికి చెందిన రమణమ్మ సౌదీలో అనారోగ్యంతో బాధపడుతూ.. తన మనోవేదనను వీడియోకాల్ ద్వారా ఆమె భర్త ఆంజనేయులుకు తెలియజేసింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీని కలిసి తన భార్యను రక్షించి ఇంటికి రప్పించేలా చూడాలని వేడుకున్నారు. ఇందుకు వెంటనే స్పందించిన ఎస్పీ ఆమెను స్వదేశానికి రప్పించేలా ఏర్పాట్లు చేశారు. రమణమ్మను సౌదీ దేశానికి పంపిన ఏజెంట్‌ను పిలిపించి విచారించారు. ఏజెంట్ ద్వారా రమణమ్మను ఇండియాకు రప్పించేందుకు చర్యలు చేపట్టారు. తన సిబ్బందితో చేసిన ప్రయత్నాలు ఫలించడంతో రమణమ్మ సోమవారం సురక్షితంగా స్వగ్రామానికి చేరుకున్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధితురాలు రమణమ్మ, భర్త ఆంజనేయులు ఎస్పీని కలిసి ఆనందంతో ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం పోలీసుశాఖకు రుణపడి ఉంటామని తెలిపారు.



భర్త ఆంజనేయులుతో రమణమ్మ

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు టంగుటూరు విద్యార్థి



దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నందలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.దిలీప్‌కుమార్ జాతీయస్థాయి పోటీ లకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 29, 30లో టంగుటూరులో నిర్వహించిన రగ్బీ అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ పోటీలకు స్టాండ్‌బై నంబర్-1గా ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరు 25న పాట్నాలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆ విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ గణేష్‌బాబు, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ బదిలీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప గాలేరు నగరి సుజల స్రవంతి (ఎస్‌కెడి జీఎన్ఎస్ఎస్) సూపరింటెండింగ్ ఇంజినీరుగా పని చేస్తున్న ఎం. మల్లికార్జున రెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు మరియు గాలేరు నగరి సుజల స్రవంతి సూపరింటెండింగ్ ఇంజినీరుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

'ఎక్సైజ్ నేరాలను కట్టడి చేయాలి'

కడప(క్రైం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ నేరాల కట్టడికి చర్యలు చేపట్టాలని, నాటు సారా తయారీ, బెల్టు షాపులపై నిఘా ఉంచాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు ఆదేశించారు. తన కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో సారా తయారు చేసే ప్రాంతాల్లో పరిశీలించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీ ముమ్మరం చేసి ఇతర రాష్ట్రలనుంచి వచ్చే మద్యం పట్టుకోవాలని సూచించారు. మద్యం దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకు విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

'మహిళల కోసం దృఢమైన చట్టాలు'

కడప(వినాయకనగర్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం రాజ్యాంగం దృఢమైన చట్టాలను రూపొందించిందని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ రాజేశ్ కుమార్‌రెడ్డి అన్నారు. వయొలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్‌ను పురస్కరించుకుని జాతీయ సేవా పథకం, ఆర్తీహోం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రిమ్స్ వైద్యురాలు వనజ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు అన్ని హక్కులు కల్పించారన్నారు. వివక్ష లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఆర్కి. టెక్చర్ కార్యదర్శి దుర్గాకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆర్తీహోం సభ్యులు తేజ, విక్రమ్, జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారులు వరలక్ష్మి, ఉదయ్‌ప్రకాశ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహాలలో సౌకర్యాలు కల్పిస్తాం

కడప ఎడ్యుకేషన్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వసతి గృల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వైస్ చాన్స్‌లర్ కె.క్రిష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డితో కలసి ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల అవసరాలను అడిగి తెలుసుకుని.. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

విమర్శలే తప్ప చర్యలుండవు : తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో నాటి ప్రభుత్వ పెద్దలకు రూ.1750 కోట్లు లంచం ఆదాని ద్వారా ముట్టిందని అమెరికా ప్రభుత్వ సంస్థలు ఆధారాలతో సహా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాయని తులసిరెడ్డి పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ కానీ, అరెస్టు గాని, ఒప్పందాల రద్దు గాని ఏ చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొన్ని వేలకోట్ల రూపాయల సబ్సిడీ బియ్యం బ్లాక్ మార్కెటింగ్ జరిగిందని కూటమి ప్రభుత్వం ఊదరగొడుతోందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కూతల ప్రభుత్వం తప్ప చేతల ప్రభుత్వం కాదన తేటతెల్లమైందని తులసిరెడ్డి విరుచుకుపడ్డారు.

అరటి ఎగుమతులు మరింత పెరగాలి

- జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి

పులివెందుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నుంచి అరటి ఎగుమతులు మరింత పెరిగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మని జిల్లా ఉద్యాన అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి అన్నారు. మంగళవారం స్థానిక ఉద్యాన అధికారి కార్యాలయంలో అరటి ఎగుమతులపై వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం అరటి పంట ఎగుమతులు, వ్యాపారంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. పులివెం దుల అరటికి దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఎక్కువ డిమాండ్ ఉందని, అందుకు తగ్గట్లు పులివెందుల నుంచి ఆశించినంత ఎగుమతులు జరగడం లేదన్నా రు. కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి మాట్లా డుతూ అరటిలో నాణ్యతను పెంపొందిం చేందుకు, సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు క్షేత్రస్థాయిలో రైతు శిక్షణ కార్య క్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. అరటిని ఎగుమతి చేసేందుకు పులివెందులలో 600 ఎంటీఎస్ సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీ, 12ఎంటీఎస్ సామర్థ్యం గల ప్రీకూలింగ్ చాంబర్‌లు అందు బాటులో ఉన్నాయన్నారు. అరటిలో ఉప ఉత్పత్తులను ప్రోత్సహించేం దుకు పులివెందులలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌ను కూడా ఏర్పాటు చేశామని.. ఈఅవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పలువురు వ్యాపారులు మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాల వలన అరటి కాయల నాణ్యత దెబ్బతిందని... ఇతర దేశాల్లో ఆగస్టు నుంచి మార్చి 10 వరకు అరటి కాయలకు ఎక్కువగా డిమాండ్ ఉంటుందన్నారు. కానీ మన ప్రాంతంలో ఆ సమయంలో ఆశించినంత దిగుబడి అందుబాటులో ఉండదని తెలిపారు. సమస్యలను అధిగమించి ఎగుమతులు పెంచేం దుకు చర్యలు చేపడతామని జిల్లా ఉద్యాన అధికారి తెలియజేశారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



మహేంద్ర (ఫైల్‌ఫొటో)

వీరబల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు మండలంలోని దిగువరాచపల్లి గ్రామ పంచాయతీ నాయునివారిపల్లెకు చెందిన చిత్రాజు మహేంద్రనాయుడు (23) బెంగుళూరుకు వెళ్లి, ఓ మెడికల్ షాప్‌లో పని చేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. భార్య కాన్పు కోసం పుట్టింటికి వెళ్లగా.. ప్రస్తుతం తల్లి అతని వద్ద ఉంటోంది. ఆమె పింఛను కోసం స్వగ్రామానికి రాగా, ఆదివారం రాత్రి మహేంద్ర నాయుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మంగళవారం గ్రామానికి తీసుకు వచ్చారు. మృతుడికి భార్య మల్లీశ్వరి, రెండేళ్ల కూతురు, రెండు నెలల బాబు ఉన్నారు.

గొడవ కేసులో ఇద్దరికి రిమాండ్

ముద్దనూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో గొర్రెల దొంగతనం విషయంలో జరిగిన గొడవకు సంబంధించి మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఈశ్వరయ్య, శివశంకర్‌లను అరెస్టు చేసి, గొడవ సమయంలో ఉపయోగించిన బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

కాలుజారి కుందూ నదిలో పడి వృద్ధురాలు మృతి

చాపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామం వద్ద కుందూ నదిలో మంగళవారం మధ్యాహ్నం నూకనబోయిన సుబ్బమ్మ (70) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీ సుల వివరాల మేరకు.. అల్లాడుపల్లె గ్రామానికి చెందిన సుబ్బమ్మ నదిలో పూజ చేసేందుకు వచ్చి ప్రమాదశాత్తు కాలుజారి నీళ్లలో పడి గల్లంతయ్యింది. కొంత దూరం కొట్టుకుపోయి చిన్న నీటి గుంతలో ఇరుక్కుపోయి మృతి చెందింది. ఆదారిన పోయేవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కడప(క్రైం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఫక్కీరుపల్లెకు చెందిన గజ్జె రంగయ్య అనే వ్యక్తి అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. రంగయ్య సత్యసాయి జిల్లా మడకశిర మండలంలో ఎంఎల్‌టీగా పని చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీ సోమవారం బ్యాంకుకు వెలుతున్నట్లు చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో భార్య సురేఖ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.



డ్వాక్రా మహిళలే... టార్గెట్

- ప్రభుత్వ అధికారులమంటూ బురిడీ
- జాగ్రత్త లేకుంటే ఖాతా ఖాళీనే
- సైబర్ నేరగాళ్ల నయా దోపిడీ

ఇలా మోసం చేస్తారు...

కడప కలెక్టరేట్ నుంచి మాట్లాడుతున్నాను.. మీరు లోను ఎంత తీసుకున్నారు.. ఇప్పటి వరకు ఎంత చెల్లించారు.. అంటూ డ్వాక్రాసంఘాల సభ్యులకు ఫోను చేసి.. మాటలు కలుపుతారు. ప్రభుత్వం కొత్త స్కీం పెట్టిందని.. మీ గ్రూపు సభ్యులకు ఆ డబ్బు జమ అవుతుందని నమ్మిస్తారు. తరువాత వారి ఖాతా వివరాలు తెలుసుకుంటారు.. మీ మొబైల్‌కు ఓటీపీ నెంబరు వచ్చింది.. ఒకసారి చూసి చెప్పమంటారు. కలెక్టరు కార్యాలయం అధికారి కదా.. అని నమ్మి వివరాలు చెప్పిన వెంటనే వారి ఖాతాలో ఉన్న సొమ్ము దోచేస్తున్నారు.

కడప క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేటి డిజటల్ ప్రపంచంలో ఒక్క క్లిక్‌తో ఏ సమాచారాన్నయినా సులభంగా యాక్సెస్ చేయవచ్చు. అయితే డిజిటల్ వినియోగం పెరిగిన కొద్దీ వాటిని ఆధారంగా చేసుకుని దోచుకునే నేరగాళ్ల సంఖ్య కూడా పెరుగుతుంది. ముఖ్యంగా డ్వాక్రా మహిళలే లక్ష్యంగా వీళ్ల అనేక నేరాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఇలాంటి మోసాలు ఎన్నో జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కొంత మంది మన జిల్లా వాసులను డబ్బులతో లొంగదీసుకుని వారి ద్వారా ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.

హలో.. కడప కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఫోన్ చేసున్నాం.. మీరు డ్వాక్రా గ్రూప్ సభ్యులుగా ఉన్నారా అంటూ సైబర్ నేరగాళ్ల మహిళలకు ఫోన్ చేస్తారు. కలెక్టరు కార్యాలయం అనగానే... నిజమని వారి మాటలకు నమ్మి ఖాతా వివరాలు, ఓటీపీ నెంబర్లను చెబుతున్నారు. దీంతో మహిళల ఖాతా నుంచి డబ్బు కొట్టేస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల డ్వాక్రా మహిళలనే టార్గెట్ చేసుకుని ఈ దోపిడీకి పాల్పడుతున్నారు. కొంత మంది మహిళల అకౌంటులో తక్కువ అమౌంటు ఉన్నా కూడా వదలను పరిస్థితి.

వ్యక్తిగత, ఆర్థిక సమాచారం చెప్పవద్దు

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత, ఆర్థిక సమాచారం ఫోను ద్వారా ఇతరులకు చెప్పకూడదు. ఎవరికైనా చెబితే మీ ఖాతాలో నగదును కొట్టేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాట్సప్, స్కైప్ వంటి యాప్‌ల ద్వారా వివరాలు తెలుపకూడదు. ప్రభుత్వ అధికారులు కానీ బ్యాంకు అధికారులు కానీ ఫోన్లు చేయరని... అలా ఎవరైనా చేస్తే ఫోను ద్వారా సమాచారం చెప్పకుండా నేరుగా వెళ్లి వివరాలు తెలుసుకోవడం మంచిది. అనుమానాస్పద వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లకు, లింకులకు స్పందించకూడదు.. ఓటీపీ నెంబరు చెప్పకూడదు.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్



మోసపోయిన వారు వీరే..

- కడపకు చెందిన ఓ మహిళకు ఇటీవల సైబర్ నేరగాళ్ల నుంచి ఫోను వచ్చింది. కడప కలెక్టరేట్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ నమ్మించి ఆమె అకౌంటులో ఉన్న దాదాపు 50వేలు నగదును దోచుకున్నారు.
- ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన ఓ గ్రూపు సభ్యులకు ఫోను చేసి వాళ్ల వ్యక్తిగత వివరాలు తెలుసుకుని అకౌంటులోని నగదు లక్షల్లో దోచుకున్నారు.
- బద్వేలు ప్రాంతానికి చెందిన వ్యక్తి డ్వాక్రా మహిళలకు ఫోను చేసి అధికారి పేరుతో ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఆమె అకౌంటులో నుంచి దాదాపు రూ.30వేలు అపహరించారు.
- పులివెందుల ప్రాంతానికి చెందిన ఓ మహిళకు ఫోను చేసే అధికారుల పేరుతోనే ఆమె నుంచి ఖాతా, ఓటీపీ వివరాలు తెలుసుకుని దాదాపు రూ.20వేలు అపహరించారు. ఇలాంటి ఘటనలు ప్రస్తుతం ఎక్కువ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సైబర్ మోసాల పట్ల ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

తుఫాన్ మిగిల్చిన క(న)ష్టం

● తంబళ్లపల్లెలో సుమారు 90 ఎకరాల్లో నేలవాలిన వరి, మొక్కజొన్న ● ఆందోళనలో రైతులు ● పంటలను పరిశీలించిన అధికారులు


నిమ్మనపల్లెలో నేలవాలినవరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శివశంకర్, అధికారులు


తంబళ్లపల్లెలో వర్షాలకు నేలవాలిన మొక్కజొన్న పంట

తంబళ్లపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు వరి, మొక్కజొన్న రైతులకు తీరని నష్టం మిగిల్చింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో పంటలు నేలపాలు కావడంతో రైతులు ఆందోళన లో పడ్డారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో తంబళ్లపల్లె మండలంలో సుమారు 600 ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. ముందుగా వరి సాగు చేసిన రైతులు పంట కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకున్నారు. మండలంలో సగానికి పైగా వరి కోతలు పూర్తవ్వగా.. మిగిలిన రైతులు కోతలకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో తుపాను ప్రభావంతో వర్షాలు కురవడంతో పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలవాలింది. మండలంలోని తంబళ్లపల్లె, గుండ్లపల్లె, ఎద్దులవారిపల్లె, రేణుమాకులపల్లె, గోపిదిన్నె తదితర గ్రామాల్లో సుమారు 90 ఎకరాల్లో వరి పైరు నేలవాలినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అదేవిధంగా తంబళ్లపల్లె మండల కేంద్రానికి చెందిన రైతు రామచంద్ర మూడు ఎకరాల్లో రూ. ఒక లక్ష వరకు అప్పు చేసి మొక్కజొన్న సాగు చేశాడు. పంట ప్రస్తుతం కంకులకు గింజ పట్టే దశలో ఉందని దీంతో పంట కోతలు పూరైన తర్వాత అప్పులను తీర్చే సి..నాలుగు రాళ్ల వెనుకేసుకోవచ్చని భావించిన. తరుణంలో వర్షాలతో పంట మొత్తం నేలవాలిపో యి ఆశలు అడిఆశలయ్యాయి. చేతికొచ్చిన పంట వర్షం పాలైందని ప్రభుత్వం స్పందించి నష్టపో యిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులు వారి పరిధిలోని రైతు సేవాకేంద్రం సిబ్బం దికి సమాచారం ఇవ్వాలని ఏవో రమణకుమార్ కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

నిమ్మనపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శివశంకర్, ఏవో మురళిమోహన్ పరిశీంచారు. మంగళవారం మండలంలోని తవళం, నిమ్మనపల్లి పంచాయతిల్లో రైతులు పండించిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిపంట కోసేందుకు సిద్ధంగా ఉన్న 285 హెక్టార్లలో పంట నేలవాలిందని దీనికి రైతులు మొలక రాకుండా 2శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ సంస్థ సైం టిస్టులు సోమశేఖర్, శ్రీనివాసులు ఏఈవో లక్ష్మి ప్రసన్న రైతులు పాల్గొన్నారు.

నేలవాలిన పంటల రక్షణకు జాగ్రత్తలు పాటించాలి


పంటల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోతకు వచ్చిన వివిధ రకాల పంటలు తుఫాను కారణంగా నేలవాలి దెబ్బతిన్న వాటి రక్షణకు తగు జాగ్రత్తలు పాటించాలని కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల, ఇతర శాస్త్రవేత్తలు మంగళవారం పలు మండలాల్లో పంటల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వర్షాలకు గురై కోత కొచ్చే దశలో ఉన్న వరి పంట పూర్తిగా నేలకు వొరిగిందని, దీనిని కూలీల చేతనే కోయించాలని చెప్పారు. యంత్రాలు వాడితే పూర్తిగా నష్టపోతారని చెప్పారు. టమోటా, మిరప, బొప్పాయి, ఉల్లి తదితర పంటలు సాగు చేసిన పొలాల్లో ఇప్పటికీ నీరు నిల్వ ఉన్నట్లు గుర్తించామని వీలైనంత త్వరగా నీటిని పొలాల నుంచి తొలగించాలని చెప్పారు. టమాటాలో బాక్టీరి యా మచ్చ తెగులు ఉధృతంగా ఉందని ఈ తెగులు నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాము స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.2 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. రబీ వేరుశనగ విత్తుకోవడానికి ప్రస్తుత వర్షాలు అనుకూలమన్నారు. డాక్టర్ మంజులతోపాటు సేద్య విభాగం శాస్త్రవేత్త ఎస్.సోమశేఖర్ బాబు, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

కలకడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో వివిధ పంటలను సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని డీఏవో చంద్రానాయక్ పేర్కొన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కలకడ మండలం గుడిబండ గ్రామంలో రైతుల పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో సాగైన వరి, వేరుశనగ, టమోటా పంటలకు ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరిగితే బీమా వర్తిస్తుందన్నారు. పంట బీమా ప్రీమియం వేరుశనగకు సంబంధించి ఈనెల 15లోగా వరికి ఈ నెల 31లోగా రైతు సేవా కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు లావణ్య, వెంకటమోహన్ పాల్గొన్నారు.

13న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'మహాదీపం' సందర్భంగా ఈ నెల 13న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ పీలేరు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. ప్రత్యేక బస్సు 13వ తేదీ ఉదయం 6 గంటలకు పీలేరులో బయలుదేరి 10 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని తెలిపారు. గిరిప్రదక్షిణ పూర్తయిన తరువాత రాత్రి 8 గంటలకు అక్కడ బయలుదేరి తిరిగి పీలేరుకు చేరుకుంటుందన్నారు. రానుపోను ఛార్జీలు రూ.700లుగా నిర్ణయించామని, ఆసక్తి గల వారు ఆర్టీసీ వెబ్‌సైట్‌లోగానీ, పీలేరు బస్టాండులోని కంట్రోల్ పాయింట్‌లోగానీ, 9959225679 నెంబరు సంప్రదించి టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చునని ఆయన వివరించారు.

ములకలచెరువు ఎస్ఐ గాయత్రి బదిలీ

ములకలచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఎస్ఐ గాయత్రిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను ఇక్కడి నుంచి మదనపల్లె టూ టౌన్‌కు బదిలీ చేశారు. అలాగే ములకలచెరువు ఎస్ఐగా పెద్దతిప్పసముద్రంలో పనిచేస్తున్న నరసింహుడును బదిలీ చేశారు. మదనపల్లె టూటౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న రవికుమార్ పెద్దతిప్పసముద్రంకు బదిలీ అయ్యారు.

పీలేరును అవినీతి రహిత పంచాయతీగా చేస్తాం

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పీలేరు పంచాయతీని అవినీతి రహిత కార్యాలయంగా తీర్చిదిద్దుతున్నట్లు ఈవో గురుమోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం తమ కార్యాలయ సిబ్బందితో తాము లంచం తీసుకోబోమని, ఆ పద్ధతిని ప్రోత్సహించబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కార్యాలయంలో లంచం తీసుకోవడం నేరంగా పరిగణిస్తామని, లంచం తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రజలు కూడా ఈ విషయాన్ని గుర్తించి పంచాయతీ సిబ్బందికి ఎటువంటి లంచాలు ఇవ్వకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లంచాలు తీసుకోబోమని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించిన ఈవో ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

బి.కొత్తకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో జరగనున్న రెవెన్యూ సదస్సులను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బీరంగి గ్రామంలో ఈ నెల 6న, బడికాయలపల్లెలో 11న, గట్టులో 19, 20న , బి.కొత్తకోటలో 26, 27న, గుమ్మసముద్రంలో 30న, కోటావూరులో జనవరి 1న, గోళ్లపల్లెలో జనవరి 6న, తుమ్మణంగుట్టలో జనవరి 8న రెవెన్యూ సదస్సులలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ గ్రామసభలలో రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలు తీసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ పేర్కొన్నారు. భూసమస్యలపై రైతులకు న్యాయం చేయాలనే రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

పీలేరులో: పీలేరు మండలంలో రెవెన్యూ సదస్సులు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు భీమేశ్వర రావు తెలిపారు. 6న మేళ్లచెరువు, 10న తలపుల, 11న బోడుమల్లువారిపల్లె, 12న డొడ్డిపల్లె, 13న కాకులారంపల్లె, 17న రేగళ్లు, 18న బాలంవారిపల్లె, 20న ముడుపులవేముల, 24న వేపులబైలు, 26న పీలేరులోని ఆర్టీసీ నల్లగుట్ట, 27న బండ్లవంక, 28న రాఘవేంద్ర నగర్, 31న ఎర్రంరెడ్డి గుట్ట, జనవరి 2వ తేదీన జేకే కాలనీ, 3న గూడరేవుపల్లె, 7న అగ్రహారం గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు.

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం బాలికల విద్యను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన నయీ చేతన కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల ప్రేరణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మోహనవల్లి, మోహన్‌బాబు బాలికల విద్య ఆవశ్యకతను వివరించారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్...ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):ఆటోను ట్రాక్టర్ ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీ వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు గుర్రంకొండ పట్టణం బలిజగడ్డకు చెందిన రిజ్వాన్, పీజున్నీసా దంపతులు ఆటోలో బస్టాండుకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటోను ఇందిరమ్మ కాలనీ వద్ద గుర్రంకొండ మార్కెట్ యార్డు నుంచి చెర్లోపల్లె వైపు వెళ్లుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో పిజున్నీసా, రిజ్వాన్‌కు తీవ్ర గాయాలుకాగా వారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం పిజున్నీసాను వేలూరు సీఎంసీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మదురామచంద్రుడు తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద ఆటో స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. మంగళవారం స్థానిక పుంగనూరురోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా పుంగనూరుకు చెందిన నజీర్(30) ఆటోలో 96 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. దీంతో ఆటోను స్వాధీనం చేసుకుని, నిందితుడి అరెస్టు చేశామన్నారు. అలాగే ఈ సారాకు ఆర్డర్ ఇచ్చిన నక్కలదిన్నెకు చెందిన బాబునాయక్ భార్య శ్రీలత, నాటుసారా తయారు చేసి విక్రయించిన పుంగనూరు మండలం నల్లగుట్ల తాండాకు చెందిన వాసునాయక్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

11న శోభాయాత్ర

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 11న జరగనున్న శోభాయాత్ర(కళాప్రదర్శన)ను విజయవంతం చేయాలని పీలేరులోని ఎస్ఎస్ఎఫ్ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నమయ్య కళాక్షేత్రం నుంచి టీటీడీ పరిపాలన భవనం వరకు శోభాయాత్ర జరుగుతుందని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదును సమష్టిగా చేయాలి

● పార్టీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ సూచన

మదనపల్లె అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు సమష్టిగా చేయా లని జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ సూచించారు. మంగళవారం స్థాని క బీజేపీ కార్యాలయంలో జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పార్టీ శ్రేణులు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరం చేయాలన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు, కో కన్వీనర్లు, మండల బీజేపీ అధ్యక్షులు మండలాలకు చెందిన సభ్యత్వం పూర్తి చేస్తారన్నారు. ఆన్‌లైన్ ద్వారా లక్ష వర కు జిల్లాలో సభత్వం నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. .బూత్ కమి టీలు, శక్తికేంద్రాల ఏర్పాటు, మండల కమిటీలు ఏర్పాటును నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు.రాష్ట్రంలో కూటమిప్రభుత్వ విజయాలను తెలియజేస్తూ బీజేపీ ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, జిల్లా సంస్థాగత ఎన్నికల సహాయాధికారి పుల్లినరేంద్రకుమార్‌రెడ్డి, గోరంట్ల రమేష్, గోపాల్‌రెడ్డి, శ్రీకృష్ణయాదవ్, కురబలకోట మండల అధ్యక్షుడు ఎస్ రజాక్ పాల్గొన్నారు.

వృద్ధులు, అనాథలకు దుప్పట్లు పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న పునీత్‌కుమార్

మదనపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో యాచకులు, వృద్ధులు, నిస్సయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కు మార్, కుమార్తె గానవి పుట్టిన రోజును పురష్కరించుకుని మంగళ వారం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం చలికాలం, పైగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో వారిని కొంతలోకొంత ఆదుకోవడానికి తనవంతు సాయంగా చేసినట్లు పునీత్ కుమార్ తెలిపారు. అలాగే బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేసిన ఈకార్యక్రమంలో శ్రీనివాసులు, ఆది, శశికుమార్, నాగార్జున, నితీష్, నందీప్, దేవేస్, ద్వారక, పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

తంబళ్లపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల చేత కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈవోలు మాట్లాడుతూ...దివ్యాంగుల తల్లితండ్రులు వారి పిల్లల గురించి బాధపడకుండా భవిత కేంద్రంలో శిక్షణ ఇప్పించాలన్నారు. అనంతరం పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవిత టీచర్స్ రేఖ, శ్రావణి, ఫిజియోథెరపిస్ట్ సరళ, హెచ్‌ఎంలు శ్రీనివాసులు, సాంబశివ, పీడి ఖైనుద్దీన్, పోర్డు సంస్థ ప్రతినిధి నరసింహులు, సీఆర్పీలు సుధాకర్, బాలకృష్ణ, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపొందించడానికే ఉల్లాస్ శిక్షణ

పెద్దమండ్యం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరాక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికే ఉల్లాస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు వెల్లడించారు. స్థానిక ఎంపీడీవో కార్యాయలంలో మంగళవారం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు నిరాక్షరాస్యులైన 18 నుంచి 70 సంవత్సరాల లోపు వయస్సు గల వారిని అక్షరాస్యులుగా మార్చే దిశగా వయోజన విద్యకు ట్రైనీ టీచర్‌లుగా అంగన్‌వాడీ వర్కర్లను, వెలుగు వీవో సంఘమిత్రలనుగా ఎంపిక చేశారన్నారు. ఇందులో 33మంది అంగన్‌వాడీ వర్కర్లకు గాను ఇద్దరు అంగన్‌వాడీ వర్కర్లు మాత్రం హాజరు కాగా సంఘమిత్రలు అందరూ వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మనోహర్, ఏపీఎం నరసింహులు, పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని వయోజనులందరూ విద్యావంతులు కావాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘ సభ్యలకు, వెలుగు సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయోజనులకు రాత్రి సమయంలో చదువు చెప్పేందకు మండలంలో 32 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన 32 సెంటర్లకు గానూ ఒక్కో సెంటర్‌కు 10మంది సభ్యులు ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ చలపతిరావు, ఏపీఎం మురళి, ఏపీవో రమేష్, సీసీలు వీవో లీడర్లు పాల్గొన్నారు.

మెగా పీటీఎంను జయప్రదం చేయండి

తంబళ్లపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశం(పీటీయం)ను విజయవంతం చేయాలని ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని 68 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యార్థుల సమగ్ర ప్రగతి పత్రాలు(హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డులు)ను అందచేశారు. ప్రతి విద్యార్థి తల్లితండ్రులు ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని..ఆ రోజున విద్యార్థులందరికీ హోలిస్టిక్ ప్రొగ్రెస్‌కార్డులు పంపిణీ చేస్తారని తెలిపారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 3 :(ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి చీర, జాకెట్లు, పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించాలి

● నియోజకవర్గంలో 34 చెరువులకు ఎన్నికలు
● తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి సూచించారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ములకలచెరువు, తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 34 చెరువులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందులో పెద్దతిప్ప సముద్రం మండలంలో ఏడు, తంబళ్లపల్లె ఏడు, ములకలచెరువు ఏడు, పెద్దమండ్యం 6, కురబలకోటలో రెండు చెరువులకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అందరూ కలిసి కట్టుగా ముందుకెళ్లాలని అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తలు పాటించి మంచి వ్యక్తులకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్ద మసీదు వద్ద ఉన్న ఆస్తి అంజుమన్ కమిటీదే..

● కమిటీ అధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ వెల్లడి


మాట్లాడుతున్న అంజుమన్ కమిటీ అధ్యక్షుడు

మదనపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):స్థానిక పెద్ద మసీదు వద్ద ఉన్న ఆస్తి అంజుమన్-ఏ-అందర్-ఇస్లాం కమిటీదేనని ఆ కమిటీ అధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ వెల్లడించారు. ఆ విలువైన ఆస్థి వక్ఫ్‌బోర్డుకు సంబంధం లేదని, ఏదో గెజిట్ ఆధారంగా స్వాధీనం చేసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. స్థానిక అంజుమన్ కాంప్లెక్సులో కమిటీ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ అది వక్ఫ్‌బోర్డు ఆ ఆస్థినే అయితే, 23 ఏళ్లుగా ఏం చేస్తున్నారని మస్తాన్ ప్రశ్నించారు. స్థానిక కదిరిరోడ్డులో 2021లో జామీయా మసీదు భూమిని స్వాధీనం జిల్లాస్థాయి అధికారులు, పోలీసు బందోబస్తు మధ్య స్వాధీనం చేసుకున్నా రని, ఇప్పుడు కేవలం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మాత్రమే వచ్చి నిబంధనలకు విరుద్ధంగా స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించడాన్ని కమిటీ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఏమాత్రం సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశం లో కమిటీ ఉపాధ్యక్షుడు ఫైనుల్లా, జాయింట్ సెక్రటరీ ఎస్.జడ్.నాసీర్ పాల్గొన్నారు.

అందరినీ కలుపుకునే పాలకవర్గం ఏర్పాటు

● టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె టౌన్‌బ్యాంకు ఎన్నిక ల్లో బ్యాంక్ లావాదేవీలు నిర్వహించే అన్ని పార్టీ ల తరపున డైరెక్టర్లు ఉంటారని టౌన్ బ్యాం కు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయం లో విలేకర్ల సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ ముప్పై ఏళ్లగా టౌన్‌బ్యాంకు పాలకవ ర్గంలో అన్ని పార్టీల వారు డైరెక్టర్లుగా ఎన్నుకుంటారన్నారు. ఇందులో లాలూచి పడే అవకాశం లేదన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్‌పై ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేయడం తప్పా అని ప్రశ్నించారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ మాట్లాడుతూ అవినీతి కొమ్ముకాస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని ప్రజలే ముందుకొస్తున్నారన్నారని దీనిపై వైసీపీ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాట కొండ మధుబాబు, సంగం శ్రీనివాసులు, చల్లా నరసింహులు, నవీన్‌చౌదరి, షంషీర్, నాగూర్‌వలి, మధు, వేణు, భారతి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ర్యాఫ్టింగ్ క్యాంప్‌లో మిట్స్ విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కల్నల్ మోహన్‌నాయక్

కురబలకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని వాటర్ ర్యాఫ్టింగ్ క్యాంప్ పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరానికి చెందిన లాస్య ప్రియా ఎన్‌సీసీ విభాగానికి చెందిన విద్యార్థిని కర్ణాటకలోని దండేలిలో వాటర్‌ర్యాఫ్టింగ్, స్విమ్మింగ్ పోటీలలో పాల్గొ న్నారన్నారు. ఈ పోటీలలో ఏపీకి చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కన బరిచి విద్యార్థిని లాస్యప్రియా కల్నల్ మోహన్‌నాయక్ చేతులు మీదగా బహుమతిని, ప్రశంశాపత్రాన్ని సాధించి అందుకున్నారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌద రి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి.ఎన్, కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్, లెఫ్టినెంట్ నవీన్‌కు మార్ అభినందించారు.

జాతీయ టెన్నిస్ పోటీల్లో మదనపల్లె వైద్యుల ప్రతిభ


60ఏళ్ల విభాగంలో కాంస్యపతకం సాధించిన రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి

మదనపల్లె టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ టెన్నిస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నిర్వహించిన టెన్నీస్ పోటీల్లో మదనపల్లె వైద్యులు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో మదనపల్లెకు చెందిన వైద్యులు డాక్టర్ ఎస్.రవికుమార్, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి జట్టు 60ఏళ్ల పైబడిన విభాగంలో చక్కటి పోటీ ఇచ్చారు. వారి జట్టు మెన్స్ డబుల్స్‌లో తృతీయ బహుమతి గెలుచుకుని కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా వారిని ఇండియన్ యూనియన్ క్లబ్ అధ్యక్షుడు రాటకొండ బాబురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణారెడ్డి, టెన్నీస్ కోచ్ ఎం.భాస్కర్‌నాయుడు అభినందించారు.

పీఎంఏవై పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్దమండ్యం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) అర్హులైన నిరుపేదలు కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం ద్వారా పక్కాగృహాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని పెద్దమండ్యం హౌసింగ్ ఏఈ అక్రం పేర్కొన్నారు. పెద్దమండ్యంలోని హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పీఎంఏవై పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పక్కా గృహానికి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. రెండు లక్షల యాభైవేలు ఆదాయంలోబడి ఉన్న అర్హులైన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హౌసింగ్ కార్యాలయం లేదా గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పింఛా నది పరిసరాలకు వెళ్లొద్దు


ప్రజలను హెచ్చరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు నది పరివాహక ప్రాంతాల్లోకి ప్రజలెవరూ వెళ్లకూడదని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు దిగువ భాగంలో నది పరివాహక ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పింఛా ప్రాజెక్టు నిండడంతో దిగువకు నీరు విడుదల చేసినందున నది వద్దకు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఏ క్షణాలైనా పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని కోరారు.